డబుల్ ధమాకా?

సుమారు 2 వేల డబుల్ ఎంట్రీలను గుర్తించిన టీడీపీ శ్రేణులు

- ఒక్కొక్కరికి రెండేసి ఓట్లు
- చంద్రగిరిలో ఒకటి, తిరుపతిలో మరొకటి



తిరుచానూరు, తిరుపతి
ఆంధ్రజ్యోతి

దొంగ ఓట్ల దందాలో రాష్ట్రంలోనే చంద్రగిరి టాప్ అని జరుగుతున్న ప్రచారం నిజమనిపించేలా రోజుకో వ్యవహారం వెలుగు చూస్తోంది. ముసాయిదా జాబితాలో లోపాలు గుర్తించి సరిదిద్దమని కోరుతూ అధికారులకు నివేదించిన తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ప్రస్తుతం తుది జాబితా పట్టుకుని ఇల్లిల్లూ తిరుగుతుండడంతో కుప్పలు తెప్పలుగా అవకతవకలు బయటపడుతున్నాయి. ఇవి పొరబాట్లా? తెలివిగా చేసిన పనులా? ఎవరు చేశారు? బీఎల్‌ఏలు ఏమి చేస్తున్నారు? ఈ సందేహాలకు అధికారులు సమాధానాలు ఇవ్వకపోతే దొంగ ఓట్ల వ్యవహారంలో వీరూ పాత్రధారులే అని జనం నమ్మే ప్రమాదం ఉంది. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో తాజాగా వెలుగు చూసిన కొన్ని విచిత్రాలు ఇవీ...

సేమ్ టు సేమ్!

చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాలు దాదాపు కలగలిసిపోయినట్టుగా ఉంటాయి. దీంతో కొందరు ఓటర్లు డబుల్ ధమాకా కొట్టేశారు. రెండు నియోజకవర్గాల్లోనూ ఓటర్లుగా నమోదయ్యారు. ఎపిక్ నెంబర్లు వేర్వేరుగా ఉంటాయి.చంద్రగిరి జాబితాలో ఇంటి పేరు ఓటరు పేరు కంటే ముందు వుంటే, తిరుపతి జాబితాలో ఓటరు పేరు తర్వాత ఇంటి పేరు వుంటుంది. ఇంటి నెంబరు మారుతుంది. ఇక వయసు, తండ్రి పేరు, ఫొటో.. అన్నీ యధాతధంగా అవే ఉంటాయి. ఇటువంటివి దాదాపు రెండు వేల దాకా ఉన్నట్టు టీడీపీ నాయకులు చెబుతున్నారు. కొన్ని ఉదాహరణలు ఇవీ..

చంద్రగిరి పరిధిలో	తిరుపతి పరిధిలో
తిరుపతి రూరల్ మండలం ఉప్పరపల్లి	**తిరుపతి అర్బన్ మంచాల వీధి స్కూలు వెనుక వీధి**
పోలింగ్ కేంద్రం నంబరు: 215	పోలింగ్ కేంద్రం నంబరు: 37
ఓటరు: పాటలపతి కిరణ్‌కుమార్ (24)	ఓటరు: కిరణ్ కుమార్ పాటలపతి (24)
ఓటరు సీరియల్ నంబరు: 190	ఓటరు సీరియల్ నంబరు: 866
ఎపిక్ నంబరు: ఏవైఎం 3439098	ఎపిక్ నంబరు: ఏవైఎం 3630415
తండ్రి ప్రసాద్ బాబు.	తండ్రి ప్రసాద్ బాబు
ప్లాట్ నంబరు 307, బీ బ్లాక్.	ఇంటి నంబరు 5-12-ఎస్1-119
చంద్రగిరి కావమ్మ గుడి వీధి	**తిరుపతి అర్బన్ మండలం గాజు వీధి**
పోలింగ్ కేంద్రం నంబరు: 151	పోలింగ్ కేంద్రం నంబరు: 32
ఓటరు: బండ పూజిత్ (19)	ఓటరు: పూజిత్ బండ (19)
ఓటరు సీరియల్ నంబరు: 281	ఓటరు సీరియల్ నంబరు: 233
ఎపిక్ నంబరు: ఐఏఎక్స్ 3240520	ఎపిక్ నంబరు: ఏవైఎం 4303368
తండ్రి: కృష్ణమూర్తి	తండ్రి: కృష్ణమూర్తి
ఇంటి నంబరు: 20-60	ఇంటి నంబరు: 4-2-21బీ-11
తిరుపతి రూరల్ మంగళం బాలకృష్ణాపురం	**తిరుపతి అర్బన్ ఇస్కాన్ రోడ్డు వీధి**
పోలింగ్ కేంద్రం నంబరు: 331	పోలింగ్ కేంద్రం నంబరు: 41
ఓటరు: జగదీప్ పేరేచర్ల (42)	పేరు: జగదీప్ పేరేచర్ల (42)
ఓటరు సీరియల్ నంబరు: 819	ఓటరు సీరియల్ నంబరు: 673
ఎపిక్ నంబరు: ఐఏఎక్స్ 3231412	ఎపిక్ నంబరు: ఏవైఎం 2153658
తండ్రి: జగన్‌మోహన్ రావు	తండ్రి: జగన్‌మోహన్ రావు
ఇంటి నంబరు: 405	ఇంటి నంబరు: 6-15-ఎస్4-126
తిరుపతి రూరల్ పేరూరు రిక్షా కాలనీ	**తిరుపతి అర్బన్ ప్రమీలా స్టోర్స్ వీధి**
పోలింగ్ కేంద్రం నంబరు: 184	పోలింగ్ కేంద్రం నంబరు: 45
ఓటరు: ఎస్ఆర్ కాంచన (49)	ఓటరు: కాంచన ఎస్ఆర్ (49)
ఓటరు సీరియల్ నంబరు: 359	ఓటరు సీరియల్ నంబరు: 790
ఎపిక్ నంబరు: ఐఏఎక్స్ 3047644	ఎపిక్ నంబరు: ఏవైఎం 1770586
భర్త : జ్ఞానశేఖర్	భర్త : జ్ఞాన శేఖర్
ఇంటి నంబరు: 3-571	ఇంటి నంబరు: 6-16-ఎస్4-274
చిన్నగొట్టిగల్లు ఫాతిమా నగర్	**తిరుపతి అర్బన్ శ్రీ సాయికృష్ణ రెసిడెన్సీ ఏరియా**
పోలింగ్ కేంద్రం నంబరు: 43	పోలింగ్ కేంద్రం: నంబరు 87
ఓటరు: ముబారక్ రాణిపేట (28)	ఓటరు: రాణిపేట ముబారక్ (28)
ఓటరు సీరియల్ నంబరు: 519	ఓటరు సీరియల్ నంబరు: 826
ఎపిక్ నంబరు: ఐఏఎక్స్ 1717289	ఎపిక్ నంబరు: ఏవైఎం 3133196
తండ్రి: అల్లాబక్ష్ రాణిపేట	తండ్రి :అల్లాబక్ష్
ఇంటి నంబరు: 1-14	ఇంటి నంబరు: 13-30-ఎస్12-836 సెకండ్ ఫ్లోర్

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పీఏకి రెండు ఓట్లు

తుడా ఛైర్మన్, చంద్రగిరి వైసీపీ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి పీఏగా వ్యవహరిస్తున్న సతీష్ అనే వ్యక్తి పేరు కూడా ఇటు చంద్రగిరిలోనూ,అటు తిరుపతిలోనూ నమోదై ఉండడం విశేషం. తిరుపతి రూరల్ మండలం అవిలాల నుంచీ చంద్రగిరి ఓటరుగా, ముత్యాలరెడ్డిపల్లిలోని దుర్గా నగర్ నుంచీ తిరుపతి ఓటరుగా వేర్వేరు ఎపిక్ నంబర్లతో నమోదై ఉంది.

చంద్రగిరిలో ఇలా...

తిరుపతి రూరల్ మండలం అవిలాల
పోలింగ్ కేంద్రం నంబరు : 244
పేరు: సతీష్ అర (34)
ఓటరు సీరియల్ నంబరు: 927
ఎపిక్ నంబరు: ఐఏఎక్స్ 3424025
తండ్రి: సుబ్రమణ్యం
ఇంటి నంబరు: 301

తిరుపతిలో ఇలా...

తిరుపతి అర్బన్ ముత్యాలరెడ్డిపల్లి (దుర్గానగర్)
పోలింగ్ కేంద్రం నంబరు: 240
పేరు: సతీష్.ఆర్ (34)
ఓటరు సీరియల్ నంబరు: 623
ఎపిక్ నంబరు: ఏవైఎం 0458042
తండ్రి: సుబ్రమణ్యం. ఆర్
ఇంటి నంబరు: 23-1-61

బీఎల్‌వోకూ రెండు ఓట్లు

సాధారణ ఓటర్ల పేర్లు ఒకటి రెండు చోట్ల ఇలా డబుల్ ఎంట్రీలుగా ఉంటే పొరపాటు అనుకోవచ్చు. ఇటువంటి పొరపాట్లు గుర్తించి సరిదిద్దాల్సిన బూత్ లెవల్ ఆఫీసర్ పేరుతోనే రెండు ఓట్లు ఉంటే.. ఏమనాలి? ఈ అధికారి మీద ఎటువంటి చర్య తీసుకోవాలి? తిరుపతి రూరల్ మండలం అవిలాలలో 243వ నంబరు పోలింగ్ కేంద్రంలో ఎం.సురేఖ అని, అదే పంచాయతీలోని 245వ నంబరు పోలింగ్ కేంద్రంలో ముత్తిరెడ్డిగారి సురేఖ అనీ రెండు చోట్ల వేర్వేరు ఎపిక్ నంబర్లతో ఓటరుగా నమోదయ్యారు. వయసు, భర్త పేరు, ఇంటి నంబరు తదితర వివరాలన్నీ రెండు జాబితాల్లో కూడా ఒకేలా వున్నాయి.ఈమె గాంధీపురం పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తోంది.

243వ పోలింగ్ స్టేషన్‌లో ఇలా...

తిరుపతి రూరల్ మండలం అవిలాల
పోలింగ్ కేంద్రం నంబరు: 243
పేరు: ఎం. సురేఖ (41)
ఓటరు సీరియల్ నంబరు :419
ఎపిక్ నంబరు: ఐఏఎక్స్ 0924019
భర్త :విజయభాస్కర్‌రెడ్డి
ఇంటి నంబరు: 8-25-9

245వ పోలింగ్ స్టేషన్‌లో ఇలా...

తిరుపతి రూరల్ మండలం అవిలాల
పోలింగ్ కేంద్రం నంబరు: 245
పేరు: ముత్తిరెడ్డిగారి సురేఖ (41)
ఓటరు సీరియల్ నంబరు: 636
ఎపిక్ నంబరు: ఐఏఎక్స్ 3411303
భర్త : విజయభాస్కర్‌రెడ్డి
ఇంటి నంబరు: 8-25-9

బదిలీలలు

తిరుపతి అర్బన్‌కు తహసీల్దార్‌ను రానీయకుండా రాజకీయ ఒత్తిళ్లు

డీటీకే పూర్తి బాధ్యతలు కట్టబెట్టే వ్యూహం

తిరుపతికి నియమించిన నాగేశ్వరరావు రేణిగుంటకు మార్పు

తిరుపతి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి అర్బన్ తహసీల్దార్‌గా పనిచేసేందుకు భయపడుతుండడం అటుంచితే, బాధ్యతలు తీసుకోనివ్వకుండా కూడా భయపెడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటరమణను కడప అర్బన్‌కు బదిలీ చేసి, కడప జిల్లా యర్రగుంట్ల తహసీల్దార్ నాగేశ్వరరావును ఇక్కడికి బదిలీ చేశారు. అయితే ఆయన బాధ్యతలు తీసుకునేందుకు వచ్చే క్రమంలో రాజకీయ ఒత్తిళ్లు వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ఆయన రేణిగుంట తహసీల్దార్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించాల్సివచ్చింది. తిరుపతి అర్బన్‌లో డీటీగా ఉన్న అశోక్ రెడ్డి ప్రస్తుతం ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా ఉన్నారు. ఆయనకే పూర్తి బాధ్యతలు అప్పగించేందుకు అధికార పార్టీ నేతలు వ్యూహం పన్నుతున్నారన్న విమర్శలున్నాయి. పదేళ్లకు పైగా అర్బన్ కార్యాలయంలో పనిచేస్తున్న ఈయన వ్యవహారశైలిపై విపక్షాలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి. తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో అవకతవకలు జరగడంలో ఆయన ప్రమేయం ఎక్కువగా ఉందని, అంతకు ముందు 2019 సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ అవకతవకలపై కూడా ఆయనపై ఆరోపణలున్నాయని విపక్షాలు అంటున్నాయి. తిరుపతి ఉప ఎన్నికకు సంబంధించి ఈఆర్వోగా పనిచేసిన అప్పటి మున్సిపల్ కమిషనర్ గిరీష, ఏఈఆర్వోగా పనిచేసిన తహసీల్దార్ జయరాములు సస్పెండైన విషయం తెలిసిందే. ఈక్రమంలో జరిగిన ఎన్నికల బదిలీలలో నాగేశ్వరరావును తిరుపతి అర్బన్ మండలానికి బాధ్యతలు తీసుకోనివ్వకుండా అడ్డుకున్నారని తెలుస్తోంది.దీంతో కడప జిల్లానుంచి బదిలీపై రేణిగుంటకు కేటాయించిన నారాయణ రెడ్డిని తిరుపతి అర్బన్‌కు మార్చారు.అయితే ఆయనను కూడా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్టు రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే అధికార పార్టీలోని ప్రధాన సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కాబట్టి బాధ్యతలు తీసుకోవచ్చనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఎస్వీఆర్ట్స్ కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్‌లు, ఈవీఎం యంత్రాల భద్రతకు సంబంధించిన వ్యవహారాలు చూసుకోవాల్సిన బాధ్యత తహసీల్దార్‌పైనే ఉంటుంది. తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి ఈఆర్వోగా మున్సిపల్ కమిషనర్, ఏఈఆర్వోలుగా అర్బన్ తహసీల్దార్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్లు వ్యవహరిస్తారు. ఎన్నికల విధుల్లో మరో డిప్యూటీ తహసీల్దార్ ఉంటారు. ఆయనే ఏఈఆర్వోగా ఉంటే పారదర్శకంగా ఎన్నికలు ఎలా జరుగుతాయని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పలువురు తహసీల్దార్లకు మళ్లీ బదిలీ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 8: జిల్లాకు కొంతమంది తహసీల్దార్లుగా బదిలీపై వచ్చారు. అయితే తెరవెనుక ఏం జరిగిందో తెలియదు కానీ రెండు రోజుల వ్యవధిలో పలువురి స్థానాలు మారిపోయాయి.తిరుపతి అర్బన్ తహసీల్దారుగా నియమించబడిన నాగేశ్వరరావును రేణిగుంటకు,రేణిగుంటకు కేటాయించిన ఎంవీఎస్ నారాయణరెడ్డిని తిరుపతికి, బీఎన్‌కండ్రిగ తహసీల్దారుగా ఉన్న బాలకిషన్‌ను ఎర్రావారిపాళేనికి బదిలీ చేస్తూ కలెక్టర్ లక్ష్మీశ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న సయ్యద్ నౌషద్ అహ్మద్ గూడూరు ఆర్డీవో కార్యాలయ ఏవోగా, అక్కడ పనిచేస్తున్న ఆదిశేషయ్య సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయ ఏవోగా బదిలీ అయ్యారు. నాగలాపురం తహసీల్దారు ప్రసన్నకుమార్‌ను తిరుపతి ఆర్డీవో కార్యాలయ ఏవోగా నియమించారు. ఓజిలి తహసీల్దారు శివరామ సుబ్బయ్యను తొట్టంబేడుకు, గుంటూరు నుంచి వచ్చిన గోపాలకృష్ణన్‌ను సూళ్ళూరుపేటకు, అక్కడ పనిచేస్తున్న కల్యాణిని నాయుడుపేటకు తహసీల్దార్లుగా నియమించారు. నెల్లూరు నుంచి సయ్యద్ ఇక్బాల్ తడ తహసీల్దారుగా బదిలీ అయ్యారు.

యాత్రకు రండి బాబూ..రండి!

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8: యాత్ర సినిమాను ఉచితంగా చూసేందుకు రండి బాబూ అంటూ అధికార పార్టీ నాయకులు జనం వెంట పడుతున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో గురువారం పాత్రికేయులకు యాత్ర-2 సినిమా టికెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. రోజు మొత్తం ఆడిన నాలుగు ఆటల్లో వీలు పడినప్పుడు సినిమాను చూడవచ్చనే వెసులుబాటు కూడా కల్పించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి ఇచ్చిన ఈ ఉచిత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సామాజిక మాధ్యమాల ద్వారా కోరడం చర్చనీయాంశంగా మారింది. ఇదే తరహాలో వైసీపీ కార్యకర్తలు ఉచితంగా సినిమాను వీక్షించేందుకు రావాలంటూ తెలిసిన వారి వెంట పడుతున్నట్టు సమాచారం.

కుష్టు రోగులనూ వదల్లేదు!

- లెప్రసీ ఆస్పత్రి వెనుక ఓ ఇంటిలో 33 దొంగ ఓట్లు
- వారంతా ఆస్పత్రిలో చికిత్సకోసం వచ్చినవారే
- ఆ ఓట్లతో సంబంధంలేదన్న ఇంటి యజమాని






లెప్రసీ ఆస్పత్రి వెనుక ఇంటిలో దొంగ ఓట్లను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో దొంగ ఓట్ల అరాచక పర్వం రోతపుట్టిస్తోంది. చికిత్స కోసం బయటి ప్రాంతాల నుంచి వచ్చే కుష్టు రోగులను కూడా ఓటర్లుగా నమోదు చేసేస్తున్నారు. 49వ డివిజన్లోని లెప్రసీ ఆస్పత్రి వెనుక 22-8-1 డోరు నెంబరులో 33 దొంగ ఓట్లు బయటపడడంతో గురువారం టీడీపీ నేతలు ఆ ఇంటికి వెళ్లి ఆరాతీశారు. వారంతా పక్కనే ఉన్న లెప్రసీ ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే రోగులని తెలియడంతో నిర్ఘాంతపోయారు. ఇంటి యజమాని రవికుమార్‌తో మాట్లాడారు. తమ ఇంటి నెంబరుతోనే వందకు పైగా దొంగ ఓట్లున్నట్టు గత ఏడాది గుర్తించామని, వాటితో తమకు సంబంధం లేదని పలుమార్లు బీఎల్వోలకు ఫిర్యాదుచేస్తే 33కు తగ్గించారన్నారు. నిజానికి తమ ఇంటిలో ఉండేది కేవలం నాలుగు ఓట్లు మాత్రమేనని చెప్పారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ ఐఏఎస్ అధికారులు సస్పెండయినా తిరుపతిలో దొంగ ఓట్ల ప్రక్షాళన జరగడం లేదని మండిపడ్డారు. ఎక్కడెక్కడినుంచో వైద్యం కోసం వచ్చే లెప్రసీ రోగులను, నైట్ షెల్టర్లలో ఉండేవారిని ఓటర్లుగా చేర్చేశారన్నారు. తిరుపతిలో న్యాయబద్ధంగా గెలవలేమని తెలుసుకున్న వైసీపీ నాయకులు ఇంతటి రోత పనులకు దిగుతున్నారన్నారు. ఇలాంటి ఓటరు జాబితాతో ఎన్నికలకు ఏవిధంగా వెళ్లాలని ప్రశ్నించారు. దీనిపై ఈసీ, ఈఆర్వోలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు.అనంతరం జీవకోనలో వైసీపీ సేవాదళ్ రీజనల్ కోఆర్డినేటర్ తలారి రాజేంద్ర ఇంటికి వెళ్లారు. ఆ ఇంటి నెంబరు పక్కన ఏ, బీ, సీ అని చేర్చి ఏకంగా 38 ఓట్లను చేర్చారని బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. టీడీపీ నేతలు ఆ ఇంటికి వెళ్లి 38 ఓట్లు ఎలా వచ్చాయని ఆరా తీశారు.లక్ష్మీపురం ప్రాంతానికి చెందిన 3వ డివిజన్ కార్పొరేటర్ గణేష్ కుమార్ ఓటు కూడా ఇదే డోర్ నెంబరులో ఉండడమేంటని ప్రశ్నించారు.అలాగే కొర్లగుంటలో వైసీపీ కార్యకర్తకు చెందిన సింగిల్ బెడ్‌రూం ఇంట్లో 32 ఓట్లున్నాయని గుర్తించామన్నారు. రోజూ దొంగ ఓట్ల గురించి మీడియలో కథనాలు వస్తున్నాయని, విపక్షాలు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తున్నప్పటికీ అధికారుల్లో చలనం లేకపోవడం బాధాకరమన్నారు.కొత్తగా వచ్చిన అధికారులైనా వీటిపై దృష్టిపెట్టాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, కంకణాల రజనీకాంత్ నాయుడు, కొట్టే హేమంత్ రాయల్,శ్రీధర్ వర్మ, బుల్లెట్ రమణ, మహేష్ యాదవ్, కుమారమ్మ, మునిశేఖర్ రాయల్, విశ్వనాథం, నాగరాజు నాయుడు, శ్రీనివాస్ యాదవ్, ఈశ్వర్, లక్ష్మి, వెంకీ, ప్రశాంత్, తిరుమల నాయుడు, మురళి, లలిత తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ఓటర్ల జాబితాలో మృతులు!

తిరుమల, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): మరణించిన వారి ఓట్లు తిరుమల ఓటర్ల జాబితాలో కొనసాగుతూనే వున్నాయి.చనిపోయిన 69మంది ఓట్లను తొలగించనే లేదు. గతంలో 120 మృతుల ఓట్లతో పాటు, 29 డబుల్ ఎంట్రీలు ఉండడాన్ని గుర్తించి వాటిని తొలగించాలని టీడీపీ నేతలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో బీఎల్వోలు తిరుమలకు చేరుకుని ఐదు బూత్‌లతోని ఓట్లను పరిశీలించి తప్పులను సరిచేశారు. తాజా ఓటరు జాబితాలో తిరుమలలో మొత్తం 5,339 మంది ఓటర్లున్నారు. అయితే ఒకటో బూత్‌లో 16మంది, రెండవ బూత్‌లో 11మంది, మూడవ బూత్‌లో 39మంది, ఐదవబూత్‌లో ముగ్గురు చొప్పున మొత్తం 69 మంది చనిపోయిన వారి ఓట్లు కొనసాగుతూనే వున్నాయి. వీటితో పాటు మూడు డబుల్ ఎంట్రీలు కూడా వున్నాయి. చనిపోయిన వారి కుటుంబ సభ్యుల నుంచి డెత్ సర్టిఫికెట్ తమకు అందకపోవడంతో వాటిని తొలగించలేకపోయామని అధికారులు చెబుతున్నారని టీడీపీ అధ్యక్షుడు రాజుయాదవ్ తెలిపారు.



17న జీఎస్‌ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ప్రయోగం

ఉపగ్రహ అనుసంధాన పనులు పూర్తి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8: ఇస్రో మరో కీలక ప్రయోగానికి సన్నద్ధమైంది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ నెల 17న సాయంత్రం 5.30 గంటలకు జీఎస్‌ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్‌ను ప్రయోగించనుంది. ఈ రాకెట్ ద్వారా ఇన్‌శాట్-త్రీడీఎస్ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక సమీపంలోని వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో ఇప్పటికే రెండు దశల రాకెట్ అనుసంధాన పనులు పూర్తయ్యాయి. గురువారం వ్యాబ్‌లో రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహ అనుసంధానం చేపట్టి శాటిలైట్ చుట్టూ హీట్‌షీల్డ్ (ఉష్ణకవచం) అమర్చే ప్రక్రియను పూర్తి చేశారు.తుది పరీక్షలు నిర్వహించిన తరువాత రాకెట్‌ను ప్రయోగ వేదికకు తరలిస్తారు.

→ ఇన్‌శాట్-త్రీడీఎస్ ఉపగ్రహం చుట్టూ అమర్చిన హీట్‌షీల్డ్

ఎండ మండుతోంది !

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 8: చిత్తూరు జిల్లాలో అప్పుడే ఎండలు మండుతున్నాయి. చిత్తూరులో నమోదవుతున్న పగటి ఉష్ణోగ్రతతో నగరవాసులు భయపడిపోతున్నారు. మార్చినెల రాకముందే ఎండలు ఇంత తీవ్రంగా ఉంటే.. ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితులు ఎలా ఉంటాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో మధ్యాహ్నంవేళ వేడిగాలుల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. దీతో విద్యుత్ వినియోగమూ పెరుగుతోంది. చిత్తూరులో బుధవారం పగటి ఉష్ణోగ్రత 34.18 డిగ్రీలు, గురువారం 34.19 డిగ్రీలు నమోదయ్యాయి.



అటవీశాఖ అధికారుల అదుపులో సుధాకర్

ఎర్రచందనం పట్టివేత: స్మగ్లర్ అరెస్టు

ఎర్రావారిపాలెం,ఫిబ్రవరి8: తలకోన అడవుల నుంచి ఎర్రచందనాన్ని తరలిస్తున్న ముఠాపై దాడి చేసి రూ.10 లక్షల విలువైన దుంగలను స్వాధీనం చేసుకుని ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసినట్లు భాకరాపేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ దత్తాత్రేయ తెలిపారు. తలకోన సెంట్రల్ అటవీ పరిధిలో 12మంది స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను మోసుకొస్తుండగా అటవీ అధికారులు చుట్టుముట్టారు. స్మగ్లర్లు దుంగలను కింద పడవేసి తప్పించుకోగా తమిళనాడు రాష్ట్రం తరుణ్ణామలై జిల్లాకు చెందిన సుధాకర్ మాత్రం పట్టుబడ్డాడు. ఘటనా స్థలం నుంచి 378 కిలోల బరువున్న 12 'ఏ' గ్రేడ్ రకం ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ తెలిపారు. ఈ దాడిలో అధికారులు సల్లావుద్దీన్, ప్రదీప్ చాంద్, లక్ష్మీప్రసాద్, రాజేష్, డ్రైవర్ శంకర్ పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు



చంద్రగిరి, ఫిబ్రవరి 8: చంద్రగిరిలోని వైఎస్ఆర్ మహిళా మార్ట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను గురువారం డీపీఎం షణ్ముగం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా మార్ట్‌లో వారానికి ఒక్క రోజు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేసామన్నారు. ఈ స్టాల్లో ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు, ఆకు కూరలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు.అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, ఏఆర్పీ భానుమూర్తి పాల్గొన్నారు.

ఎంబీయూలో వడేర్ స్వామి



ఎంబీయూ లైబ్రరీలో విద్యాధీశ తీర్థ వడేర్ స్వామి, మోహన్‌బాబు

చంద్రగిరి, ఫిబ్రవరి 8: ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయాన్ని గురువారం కర్ణాటకకు చెందిన విద్యాధీశ తీర్థ వడేర్ స్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యావంతులు ప్రపంచమంతా పూజింపబడతారని నమ్ముతున్నట్లు పేర్కొన్నారు. ఆయన్ను ఎంబీయూ ఛాన్సలర్ మోహన్‌బాబు ఘనంగా సత్కరించారు. వైస్‌ఛాన్సలర్ నాగరాజరామారావు, రిజిస్ట్రార్ సారధి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు కేంద్రం చట్టబద్ధత కల్పించాలి

- ఎమ్మార్పీఎస్ డిమాండ్ -

చంద్రగిరి, ఫిబ్రవరి 8: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో త్వరగా చట్టబద్ధత కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటపతి మాదిగ డిమాండ్ చేశారు. జనాభా ప్రకారం ఎస్సీ, ఎస్టీ ఉప కులాలకు సమన్యాయం, సామాజిక న్యాయం అందించాలని తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఎస్సీ, ఎస్టీ ఉపకులాలకు విద్య, ఉద్యోగ రంగాలల్లో రిజర్వేషన్ ఫలాలు జనాభా ప్రకారం అందక కులాల మధ్య అంతర్గత అసమానతలు ఏర్పడ్డాయన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు సుబ్బరామయ్య, కత్తి హరి, పోట్లూరి రామారావు, రామూర్తి, శంకర్, రవి, గురుమూర్తి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ



పాకాల, ఫిబ్రవరి 8: మహిళలు ఆర్థికంగా ఎదిగేలా స్వయం ఉపాధి కల్పించడానికి పులివర్తి నాని గార్మెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తారని పులివర్తి సుధారెడ్డి హామీ ఇచ్చారు. గురువారం దామలచెరువులో నిర్వహించిన మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో గురించి వివరించారు. వైసీపీ పాలనలో విద్యుత్ చార్జీలు, నిత్యావసరాల ధరలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యమైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పులివర్తి నానిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

పాకాల, ఫిబ్రవరి 8: దామలచెరువు పరిసరాలలోని పోలింగ్ బూత్‌లను గురువారం తహసీల్దార్ వాణిశ్రీ తనిఖీ చేశారు. పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలను పరిశీలించారు. మౌలిక సదుపాయాల కల్పన గురించి సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మోహన్, జూనియర్ అసిస్టెంట్ పవన్, వీఆర్వో విజయకుమార్, బిఎల్‌వోలు చందన, దీప్తి, కార్తీక్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో...

రామచంద్రాపురం, ఫిబ్రవరి 8: మండలంలోని నెన్నూరు, రామాపురం, నడవలూరు, గంగిరెడ్డిపల్లి ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు ఉషారాణి సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎన్నికల సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు విజయభాస్కర్‌రెడ్డి, ప్రసాద్‌బాబు తదితరులున్నారు.



ఉచిత బస్సులో రద్దీ కారణంగా ఎక్కకుండానే వెనుదిరుగుతున్న దివ్యాంగుడు



గదుల కోసం క్యూలో ఉన్న వృద్ధులు - గదికి వెళుతున్న వృద్ధులు



లగేజీతో ఇబ్బందిపడుతున్న వృద్ధుడు

తిరుమలలో వృద్ధుల పాట్లు

● అందుబాటులో లేని బ్యాటరీ వాహనాలు ● ఒకచోట నుంచి మరోచోటకు వెళ్లేందుకు అగచాట్లు

తిరుమల, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీనివాసుడిని దర్శించుకునే భక్తుల్లో అధిక శాతం వృద్ధులే ఉంటారు. దివ్యాంగులు కూడా తిరుమల క్షేత్రానికి వస్తుంటారు. వ్యయప్రయాసల కోర్చి స్వామికొండకు చేరుకున్న తర్వాత వారు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వసతి కేటాయించే కేంద్రాల నుంచి గదుల వరకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్యాక్సీ డ్రైవర్లు డిమాండ్ చేసినంత సొమ్ము చెల్లించలేక, ఉచిత బస్సుల్లో రద్దీ కారణంగా ప్రయాణించలేక అగచాట్లు పడుతున్నారు. మరోవైపు బస చేసే గదుల నుంచి ఆలయం పక్కనే దర్శనానికి వేచి ఉండే వయోవృద్ధులు, దివ్యాంగుల షెడ్ వద్దకు చేరుకోవడానికి కూడా ఇబ్బందిపడుతున్నారు. భక్తులు ఒక ప్రాంతం నుంచి మరోప్రాంతానికి చేరుకునేందుకు ఉచిత బస్సులతో పాటు బ్యాటరీ వాహనాలను కూడా అందుబాటులో ఉంచామని టీటీడీ చెబుతున్నప్పటికీ వాటి జాడే కనిపించడం లేదు. గంటల తరబడి రోడ్డుపై ఉచిత బస్సుల కోసం వేచి ఉండటం, వచ్చిన బస్సులో అధిక రద్దీ కారణంగా ప్రయాణించలేక వృద్ధులు, దివ్యాంగులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గది పొందే సమయంలోనే డిపాజిట్ తీసుకుని వీల్ ఛైర్లు కేటాయించాలని కొందరు విన్నవించుకుంటున్నారు. వీలైనన్నీ బ్యాటరీ వాహనాలను అందుబాటులో ఉంచాలనే అభిప్రాయాలు వ్యక్తవుతున్నాయి. సులభతరంగా గదులు పొందే వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

టీటీడీ ఉద్యోగుల ఇళ్లపట్టాలకు పల్లంలో భూసేకరణ

● యుద్ధప్రాతిపదికన సర్వేపనులు ప్రారంభం



పల్లం వద్ద సేకరిస్తున్న భూమిలో పంటలు

ఏర్పేడు, ఫిబ్రవరి 8: టీటీడీలో మరి కొందరు ఉద్యోగులకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వ భూమిని సేకరిస్తున్నారు. ఏర్పేడు మండలం పల్లం రెవెన్యూ పరిధిలోని 400 ఎకరాలను తహసీల్దారు ఉదయ్ భాస్కర్‌రాజు గురువారం పరిశీలించారు. సర్వేయర్ ప్రసాద్ ఆధ్వర్యంలో సర్వే పనులు యుద్ధప్రతిపాదికన చేపట్టారు. పల్లం రెవెన్యూ పరిధిలో పల్లం దళితవాడ, పల్లంపేట దళితవాడ, పల్లంపేట గిరిజన కాలనీ, గొల్లపల్లి గిరిజనకాలనీలో 320మంది రైతులకు భూములు ఉన్నాయి.20 ఏళ్ల కిందట దళితులు, గిరిజనులకు అప్పటి ప్రభుత్వం ఒక కుటుంబానికి ఒకటిన్నర ఎకరా చొప్పున భూమిని ఇచ్చింది. అప్పటి నుంచి రైతులు ఆ భూములను సాగు చేసుకుంటున్నారు. వర్షాధార పంటలను పండించుకుంటున్నారు. ఇప్పటికే 200మంది రైతులకు భూములు తీసుకుంటున్నట్లు రెవెన్యూశాఖ తరఫున నోటీసులు ఇచ్చారు. మిగిలిన రైతులకు కూడా రెండు మూడు రోజుల్లో నోటీసులను రెవెన్యూశాఖ అందించనుంది. కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం పల్లం రెవెన్యూ పరిధిలో భూములను పరిశీలించనున్నారు. కలెక్టర్ పరిశీలన అనంతరం రైతులతో సమావేశం ఏర్పాటు చేసి భూమికి పరిహారం ఎంత చెల్లించాలనే విషయాలను చర్చిస్తామని తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు తెలిపారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం



రామచంద్రాపురం, ఫిబ్రవరి 8: టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకుడు పులివర్తి వినీల్ అన్నారు. మండలంలోని ఎన్ఆర్ కమ్మపల్లి పంచాయతీలో 'బాబు ష్యూరిటీ..భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినీల్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు జగన్ ప్రభుత్వంలో దగా పడటంతో టీడీపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పులివర్తి నానీని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, నాయకులు చిన్నబాబు, హరిప్రసాద్, జేడీ జగన్, నరసింహారెడ్డి, గిరినాయుడు, సురేంద్రనాయుడు, దినేష్, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఇంటింటి ప్రచారం



రామచంద్రాపురం, ఫిబ్రవరి 8: మండలంలోని మిట్టకండ్రిగ, కుప్పం బాదూరు, కాలేపల్లి, నెత్తకుప్పం, అనుపల్లి పంచాయతీల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. వైసీపీ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు.ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ డిల్లీరాణి భానుకుమార్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు దామోదర రెడ్డి, రఘునాథరెడ్డి, యోగానందరెడ్డి, మురగయ్య పాల్గొన్నారు.

60 రోజుల్లో అధికారంలోకి : పులివర్తి నాని



కార్యక్రమంలో పాల్గొన్న పులివర్తి నాని, ఈశ్వర్‌రెడ్డి

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 8: రాబోయే 60 రోజుల్లో రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని చంద్రగిరి టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని పేర్కొన్నారు. లింగేశ్వర్ నగర్‌లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ లింగేశ్వర్ నగర్‌లో చెత్త, మురుగునీటి కాలువలు, రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. కనీసం వీధి లైట్లు వెలగడం లేదన్నారు. అర్హులందరికీ పెన్షన్లు, ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానని స్పష్టంచేశారు. కూలిన బ్రిడ్జిలు, రైతాంగ సమస్యలను సత్వరం పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ టీడీపీ అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మైరావణ నాటకం

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 8: దుర్గ సముద్రంలో నిర్వహించిన మైరావణ నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీరాముడు, రావణాసురుడి మధ్య కథను పద్య రూపంలో కళాకారులు అద్భుతంగా ఆలపించారు. చెడుపై మంచి సాధించిన విజయాన్ని ఈ పౌరాణిక నాటకంలో రక్తి కట్టించారు. ఈ కార్యక్రమంలో శేఖర్, మునికృష్ణయ్య, మోహన్, శేఖర్ తదితరుల కళాకారులు ఆకట్టుకున్నారు. ఈ నాటకాన్ని వీక్షించేందుకు పరిసర గ్రామాలకు చెందిన జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.





గ్రామస్తులతో కలిసి మురుగు కాలువను పరిశీలిస్తున్న బడి సుధాయాదవ్

మరో ఉద్దానంలా వెంకటంపేట

ఓబీసీ రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్ ఆవేదన

చంద్రగిరి, ఫిబ్రవరి 8: చంద్రగిరి మండలం రాయలపురం పంచాయతీలోని వెంకటంపేట మరో ఉద్దానంలా తయారైందని ఓబీసీ రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్ అన్నారు. గురువారం వెంకటంపేటలో మురుగు కాలువను గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. గత నెలలో కిడ్నీ సమస్యతో మరణించిన వివాహిత కుటుంబానికి రూ.5 వేల సాయం అందించారు. అనంతరం ఎంపీడీవో వెంకట సూర్యసాయికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటితో మురుగునీరు కలిసి జనం రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఇద్దరు కిడ్నీ సమస్యలతో మరణించగా, మరో నలుగురు చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కిడ్నీ రోగులకు రూ.5 లక్షలు వైద్యసాయం అందించాలని డిమాండ్ చేశారు. 48 గంటల్లో వెంకటంపేట మురుగు కాలువ సమస్య పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

గజవాహనంపై లోకమాత సాక్షాత్కారం




గజవాహనంపై ఊరేగుతున్న పద్మావతి అమ్మవారు

తిరుచానూరు, ఫిబ్రవరి 8: తిరుచానూరులో కొలువైన పద్మావతి దేవి గురువారం రాత్రి గజవాహనంపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తరాషాఢను పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం సర్వాలంకార శోభితురాలైనా అమ్మవారు గజవాహనంపై కొలువుదీరి ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. మంత్రి చెల్లు బోయిన వేణుగోపాలకృష్ణ అమ్మవారిని దర్శించుకుని గజవాహనసేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్, మధు, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చేసి రూ.1.05 లక్షలు కొట్టేశాడు!

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 8: ఏటీఎం కార్డు మార్చేసి రూ.1.05లక్షలు చోరీ చేసిన సంఘటన గురువారం వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. పెళ్లకూరు మండలం చెంబడిపాళెం గ్రామానికి చెందిన సురేష్ ఈనెల ఆరో తేదీన నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఏటీఎం వద్ద కెళ్లాడు.తన వద్ద ఉన్న ఏటీఎం కార్డు ద్వారా నగదు తీసుకోవడానికి ప్రయత్నించాడు. నగదు రాకపోవడంతో ఏటీఎం నుంచి బయటకు వస్తున్నాడు. ఇంతలో వెనుక ఉన్న ఓ వ్యక్తి తాను నగదును డ్రా చేయిస్తానని చెప్పి, కార్డును తీసుకున్నాడు. డ్రా చేస్తున్నట్లు నమ్మించి వేరే ఏటీఎంకార్డును సురేష్‌కిచ్చాడు. అప్పటికే పిన్ నెంబరు తెలుసుకోవడంతో సురేష్ బ్యాంకు ఖాతా నుంచి పలు దఫాలుగా రూ.1.05లక్షలను డ్రా చేసేశాడు. మరోవైపు తన ఖాతాలో డబ్బులున్నా ఏటీఎం నుంచి నగదు రావడం లేదంటూ బాధితుడు బ్యాంకుకు వెళ్లి వివరాలు ఆరా తీశాడు. దాంతో నగదు డ్రా చేసిన విషయం బయటపడింది. దాంతో లబోదిబోమంటూ నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



'ఆరణి'కి మొండిచేయి

● రాజ్యసభకు పంపిస్తామని మాట తప్పిన వైసీపీ ● తీవ్ర అసంతృప్తిలో బలిజ సామాజికవర్గం ● చిత్తూరు ఎమ్మెల్యే భవిష్యత్తుపై చర్చ

చిత్తూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు వైసీపీ అధిష్ఠానం మొండిచేయి ఇచ్చింది. వచ్చే ఎన్నికల్లో ఆరణికి కాకుండా విజయానందరెడ్డికి అవకాశం ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆరణిని, బలిజ సామాజికవర్గాన్ని దూరం చేసుకోకూడదనే ఉద్దేశంతో రాజ్యసభకు పంపిస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చింది. దీంతో తనకు టికెట్ రాకపోయినా మిగిలినవారిలా ఆయన అసమ్మతి రాగం వినిపించలేదు. తీరా వైసీపీ గురువారం విడుదల చేసిన రాజ్యసభ అభ్యర్థుల జాబితాలో ఆరణి శ్రీనివాసులుకు చోటు లేకుండా పోయింది. దీంతో ఎమ్మెల్యేతో పాటు బలిజ సామాజికవర్గం తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. మాట తప్పను, మడమ తిప్పను అని చెప్పుకొనే సీఎం జగన్.. చిత్తూరు ఎమ్మెల్యేకు మాత్రం అన్యాయం చేశాడని జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇక ఆరణి రాజకీయ భవిష్యత్తు ఏంటి? ఆయన అడుగులు ఎటువైపు అనేది ఆసక్తికరంగా మారింది.

ఆరణి శ్రీనివాసులు టీడీపీ, ప్రజారాజ్యం పార్టీల్లో జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి, వైసీపీలోకి చేరారు. 2019 ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన గెలిచినప్పటి నుంచీ మిగిలిన ఎమ్మెల్యేల తరహాలో పూర్తి స్వేచ్ఛ లేకుండా పోయింది. సొంత పార్టీ నాయకుడు విజయానందరెడ్డి బలమైన వ్యతిరేకవర్గంగా మారారు. అనేక సందర్భాల్లో ఎమ్మెల్యే కంటే విజయానందరెడ్డి మాటే చెల్లుబాటుఅయ్యేది. నియోజకవర్గంలో వ్యతిరేకవర్గం గట్టిగా ఉన్నా వచ్చే ఎన్నికల్లో జగన్ మరో అవకాశం ఇస్తారని ఎమ్మెల్యే ధీమాగా ఉన్నారు. కానీ, ఊహించని విధంగా వైసీపీ అధిష్ఠానం ఆరణిని పక్కన పెట్టేసి విజయానందరెడ్డికి అవకాశం కల్పించింది. రెండుసార్లు జగన్ ఆరణితో సమావేశమై రాజ్యసభకు పంపిస్తామని హామీ ఇచ్చినా.. ఆచరణలో మడమ తిప్పేశారు.

ఆరణి నిర్ణయమేంటి?



విజయానందరెడ్డి పేరు ప్రకటించినప్పటి నుంచి గెలిచేందుకు క్షేత్రస్థాయిలో గట్టిగా పనిచేసుకుంటూ పోతున్నారు. ఓసారి ఎమ్మెల్యేతో భేటీ అయి ఆయన మద్దతు కూడా కోరారు. ఆరణికు ఎంపీ సీటు ఆఫర్ చేసిన నేపథ్యంలో ఆయన విజయానందరెడ్డి గెలుపునకు కృషి చేస్తారని వైసీపీ శ్రేణులు భావించారు. తీరా ఇప్పుడు అధిష్ఠానం మొండిచేయి ఇవ్వడంతో ఆరణి నిర్ణయంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఆయన వైసీపీలోనే ఉంటూ విజయానందరెడ్డి గెలుపునకు సహకరిస్తారా? లేదా వేరే పార్టీలోకి వెళ్లి మళ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తారా? లేదా ఈ ఎన్నికలను పట్టించుకోకుండా ఊరుకుండిపోతారా? అని ఇప్పుడు చిత్తూరులో చర్చ జరుగుతోంది. సమీకరణాల కారణంగా ఇప్పుడు రాజ్యసభ అవకాశం ఇవ్వలేకపోతున్నామని.. 2026లో కచ్చితంగా అవకాశం కల్పిస్తామని వైసీపీ పెద్దలు ఎమ్మెల్యేకు చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. కానీ, ఆ హామీని ఎమ్మెల్యే, ఆయన అనుచరులు నమ్మే పరిస్థితిలో లేరు.

ఉమ్మడి జిల్లాలో 9 మంది రెడ్లే

చిత్తూరు ఉమ్మడి జిల్లాలో 14 నియోజకవర్గాలుండగా, అందులో 9 చోట్ల రెడ్లు ఉన్నారు. పుంగనూరు, పలమనేరు, చిత్తూరు, తంబళ్లపల్లె, పీలేరు, తిరుపతి, చంద్రగిరి, నగరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో ప్రస్తుతానికి వైసీపీ అభ్యర్థులు రెడ్డి సామాజికవర్గానికి చెందినవారే. పూతలపట్టు, సత్యవేడు, జీడీనెల్లూరు నియోజకవర్గాలు రిజర్వు కాకపోయి ఉంటే అక్కడా రెడ్లకే అవకాశం ఇచ్చేవారని ప్రజలు సెటైర్లు వేసుకుంటున్నారు.

కాపు ఓట్లను వద్దనుకుంటోందా..?

రాయలసీమ నాలుగు ఉమ్మడి జిల్లాలతో పాటు నెల్లూరు, ఒంగోలు జిల్లాల్లో ఇప్పుడు ఎక్కడా వైసీపీ అభ్యర్థులు బలిజ సామాజికవర్గానికి చెందినవారు లేరు. చిత్తూరులో ఆరణి శ్రీనివాసులును కాదని, విజయానందరెడ్డికి అవకాశం ఇచ్చారు. అలాగే ఒంగోలు జిల్లాలోని దర్శి నియోజకవర్గంలో మద్దిచెట్టి వేణుగోపాల్‌ను కాదని బూచేపల్లె శివప్రసాద్‌రెడ్డికి అవకాశం ఇచ్చారు. ఈ ఆరు ఉమ్మడి జిల్లాల్లో ఉన్న ఇద్దరు బలిజ ఎమ్మెల్యేలను కాదని వైసీపీ అధిష్ఠానం రెడ్డి సామాజికవర్గానికి టికెట్లను ఇచ్చింది. కాపు ఓట్లు తమకు వద్దనే ధోరణితో వైసీపీ ఉందని ఆ సామాజికవర్గం భావిస్తోంది.

నామసంకీర్తన భగవంతుడికి ప్రీతికరమైంది

పురందరదాసు ఆరాధన మహోత్సవాల్లో విద్యాప్రసన్నతీర్థ




తిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మానవ జీవితం సమస్యల వలయమని, వీటి నుంచి బయట పడాలంటే నామసంకీర్తన మంచి మార్గమని బెంగళూరులోని కుక్కే సుబ్రహ్మణ్య మఠాధిపతి విద్యాప్రసన్న తీర్థ ఉద్ఘాటించారు. నామ సంకీర్తన భగవంతుడికి అత్యంత ప్రీతికరమైందన్నారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పురందరదాసు ఆరాధన మహోత్సవాలు గురువారం తిరుమలలోని ఆస్థాన మండపంలో ప్రారంభమయ్యాయి. విద్యాప్రసన్నతీర్థ మంగళాశాసనాలు అందిస్తూ.. భగవంతుడిని చేరాలంటే ముందు ఆయన పరమభక్తుల అనుగ్రహం అవసరమని పురాణాలు పేర్కొంటున్నాయని, ఈ కోవకు చెందిన భక్తుడు పురందరదాసు అని అన్నారు. ఆయన రచించిన లక్షలాది కీర్తనలను ఆలపిస్తూ అనేక మంది స్వామి కృపకు పాత్రులవుతున్నారన్నారు. దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు మాట్లాడుతూ 4.75 లక్షల సంకీర్తనలు రచించడం పురందరదాసుకే సాధ్యమైందన్నారు. అనంతరం విద్యాప్రసన్న తీర్థను సన్మానించారు. ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి 3,500 మందికిపైగా భజనమండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

నేడు నారాయణగిరికి శ్రీవారి వేంచేపు

ఆరాధన మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సంగీత, సాహిత్య రంగాలలో నిష్ణాతులైన యువ కళాకారులకు ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నారు. సాయంత్రం 6 గంటలకు తిరుమలలోని నారాయణ గిరి ఉద్యానవనానికి శ్రీవారి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి, ఊంజల్‌సేవ నిర్వహిస్తారు.

భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయండి

కలెక్టర్ లక్ష్మీశా

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 8: జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రవాణా, రహదారులు, భవనా ల కార్యదర్శి ప్రద్యుమ్న ఆదేశించారు. అమరావతి నుంచి గురువారం వర్చు వల్ విధానంలో ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో జాతీయ రహ దారులకు అవసరమయ్యే ప్రభుత్వ, డీకేటీ, పట్టా భూములను అవసరం మేరకు సేకరించాలని సూచించారు. భూసేకరణ నోటిఫికేషన్ ఇవ్వడం మొదలుకుని అవార్డు పాసు చేయడం, నష్టపరిహారం ఇవ్వడం, అన్ని స్థాయిల్లో క్యాపిటల్ 3ఏ, 3డి, 3జి, చివరి స్టేజీ వరకు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశా మాట్లాడుతూ జిల్లాలో ఆరు ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టులకు భూసేకరణ వివిధ స్టేజీల్లో ఉందని, అవార్డు పాస్ చేయడం, పరిహారం అందజేయడం తదితర అంశాలు వేగవంతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్జీఎస్ విద్యార్థికి అభినందన


అజయ్‌ను అభినందిస్తున్న ఎస్జీఎస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 8 : టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాల బీఎస్సీ(ఎంపీసీఎస్) ఫైనల్ ఇయర్ విద్యార్థి గత నెల 26న ఢిల్లీలో నిర్వహించిన రిపబ్లిక్ డే క్యాంపులో ఎయిర్ వింగ్ విభాగంలో పాల్గొని ప్రతిభచాటారని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ హాజరైన ఈ క్యాంప్‌లో తమ కళాశాల విద్యార్థికి అవకాశం దక్కడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. గురువారం కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో అజయ్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు ఎన్‌సీసీ ఆఫీసర్లు ఉదయ, హరీష్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

సీఏ ఫౌండేషన్‌లో ఎమరాల్డ్స్ విద్యార్థుల విజయకేతనం


విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్, అసిస్టెంట్ డైరెక్టర్ మునిరత్నం

తిరుపతి (విద్య), ఫిబ్రవరి 8 : ఎల్‌బీసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ ప్రొఫెషనల్ అకాడమీ విద్యార్థులు సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారని అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.మునిరత్నం పేర్కొన్నారు. ఆర్.సత్య 314మార్కులు, ఎం.లావణ్య 265, క్రెశియ 259, ఆర్.యశ్వంత్ 257, దివాకర్‌రెడ్డి 256 వంటి అత్యుత్తమ మార్కులు సాధించి సత్తాచాటారని తెలిపారు. మొత్తం మీద తమ విద్యార్థులు 56.34శాతం మంది ఉత్తీర్ణులైనట్లు ప్రకటించారు. విద్యార్థులను డైరెక్టర్లు ఇ.గిరిధర్, కె.విశ్వనాథ్, అసిస్టెంట్ డైరెక్టర్ టి.నాదముని, అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా మహారుద్రాభిషేక సహిత శ్రీదేవి పూజ



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 8: హైదరాబాదుకు చెందిన గురుదత్త మఠం వ్యవస్థాపకుడు, దత్తోపాసకులు సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో మహారుద్రాభిషేక సహిత శ్రీదేవి పూజ మహోత్సవం గురువారం ఉదయం ప్రారంభమైంది. తిరుపతి పద్మావతి కల్యాణ మండపం-2లో మాసశివరాత్రి సందర్భంగా 60 మంది వేదపండితులు 1,500 సార్లు నమక చమకాలతో మహారుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం చండీపారాయణం, చండీహోమం, రుద్ర, నక్షత్ర, నవగ్రహ, వాస్తు, లక్ష్మీ గణపతి హోమం చేశారు. శుక్రవారం కామాక్షి అమ్మవారిని 10 వేలసార్లు దుర్గాసూక్తంతో అభిషేకిస్తారు. లోకకల్యాణం, మానవాళి క్షేమం కోసం నిర్వహిస్తున్న ఈ రుద్రాభిషేకం, హోమం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమవుతాయి.

అలరించిన బొందు రామచంద్రారెడ్డి గేయాలు



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 8: అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న పురందరదాసు ఆరాధనోత్సవంలో భాగంగా గురువారం సాయంత్రం ప్రముఖ గాయకులు, పౌరాణిక నాటక కళాకారుడు బొందు రామచంద్రారెడ్డి ఆలపించిన భక్తి గేయాలు ప్రేక్షకులను అలరించాయి. అనంతరం ఆయన్ను రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేఎస్ రాజ, టి.సుబ్రమణ్యం రెడ్డి, కె.తిరుపాలాచారి, ఎం.గంగయ్య, శాంబోలు హరనాథ్, అన్నమాచార్య కళామందిరం అధికారి కోకిల పాల్గొన్నారు.

సైంటిస్టు పోస్టులకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 8 : స్విమ్స్ యూనివర్సిటీ క్లినికల్ వైరాలజీ విభాగంలోని పలు కాంట్రాక్టు పోస్టులకు ఈనెల 12న వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణబిట్ల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సైంటిస్టు-సి 1, సైంటిస్టు-బి 1 రెండు నాన్ మెడికల్ పోస్టులతో పాటు ప్రాజెక్ట్ రీసెర్చ్ అసిస్టెంట్(నాన్ మెడికల్) 1 పోస్టు ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి చేసిన దరకాస్తులతో పాటు అన్ని సర్టిఫికెట్లు తీసుకుని 12వ తేదీ ఉదయం 8 గంటలకు డైరెక్టర్ చాంబర్ వద్ద ఉన్న కమిటీ హాల్లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

పరిశోధనల్లో పరస్పర సహకారం

వర్క్‌షాప్‌లో ఐజర్ ప్రొఫెసర్ రామ్మూర్తి


జ్యోతిప్రజ్వలన చేస్తున్న రామ్మూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 8: పరిశోధనల్లో మంచి ఫలితాలను సాధించడం కోసం ఆయా రంగాల్లో పనిచేస్తున్న వ్యక్తులు, సంస్థల మధ్య పరస్పర సహకారం అవసరమని తిరుపతి ఐజర్ ప్రొఫెసర్ రామ్మూర్తి పేర్కొన్నారు. న్యూ హారిజన్స్ ఆఫ్ ఫ్లోరోసిస్ మైక్రోస్కోపీ టెక్నిక్ అంశంపై ఎస్వీయూ జువాలజీ విభాగంలో గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పరస్పర సహకారంతో క్లిష్టమైన అంశాలను ఛేదించడానికి అవకాశం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్ మాట్లాడుతూ పరిశోధనల్లో టెక్నాలజీని ఉపయోగించుకోవడం ద్వారా ఫలితాలను వేగంగా పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐజర్ ప్రతినిధులు శివకుమార్, సుబ్రమణ్యం, శర్మ, ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, హెడ్ కిషోర్, కన్వీనర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

పుట్టగొడుగులతో జ్ఞాపకశక్తి


మాట్లాడుతున్న డీన్ సుజాత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 8: పుట్టగొడుగులతో జ్ఞాపకశక్తి పెరుగుతుందని పద్మావతి యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ సుజాత అన్నారు. పుట్టగొడుగుల పెంపకంపై మూడు నెలల శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఆమె మాట్లాడుతూ పుట్టగొడుగుల్లో ఎన్నో పోషక విలువలు ఉన్నాయన్నారు. ఆహారంగా తీసుకోవడం ద్వారా కండరాల కదలికతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ప్రొఫెసర్ సుజాతమ్మ, కో-ఆర్డినేటర్ జీవనజ్యోతి పాల్గొన్నారు.

నేడు రచయిత్రితో ముఖాముఖి

పద్మావతి వర్సిటీకి రానున్న చల్లపల్లె స్వరూపరాణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 8: పద్మావతి యూనివర్సిటీఇంగ్లిషు డిపార్ట్‌మెంట్‌లో శుక్రవారం రచయిత్రితో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రముఖ రచయిత్రి చల్లపల్లె స్వరూపారాణితో మధ్యాహ్నం 3 గంటలకు హ్యూమానిటీస్ సెమినార్ హాల్లో ఈ కార్యక్రమం జరగనుంది. రచయిత్రి గురించి డాక్టర్ రాసాని మాట్లాడతారని ఇంగ్లిషు డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ తుమ్మపూడి భారతి తెలిపారు.

11న అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాద నీరాజనం వేదికపై ఈనెల 11వ తేదీన ఏడవ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో అయోధ్యకాండలోని 22 నుంచి 25వ సర్గ వరకు 155 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలను కలిపి మొత్తం 180 శ్లోకాలను పారాయణం చేస్తారు. ఎస్వీ వేద విజ్ఞానపీఠం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, టీటీడీ వేదపండితులు, టీటీడీ సంభావన పండితులు, అన్నమాచార్య ప్రాజెక్ట్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పండితులు పాల్గొంటారు.

అసెంబ్లీ సాక్షిగా జగన్ క్షమాపణలు చెప్పాలి : టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 8: అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ క్షమాపణ చెప్పాలని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు అధికారంలోకి రాగానే మద్యాన్ని అంచెలంచెలుగా నిషేధిస్తామని హామీ ఇచ్చి, మాట తప్పారని విమర్శించారు. నాసిరకం మద్యం తాగి ఎంతోమంది అనారోగ్యానికి గురై చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో మహిళలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు నష్టపోయారన్నారు. బీసీ సబ్‌ప్లాన్ నిధులు రూ.75వేల కోట్లు ఇతర పథకాలకు మళ్లించారని ఆరోపించారు. తిరుపతిలో భారీగా దొంగ ఓట్లు చేర్చారని ఆరోపించారు. ఈసీ విచారించి చర్యలు తీసుకోకపోతే అఖిలపక్షం ఏర్పాటు చేసి, అన్ని వివరాలు బయటపెడతామని హెచ్చరించారు. ఎన్నికల ముందు టీటీడీలో సివిల్ వర్క్స్ కేటాయించి కోట్లలో కమీషన్లు చేతులు మారుతున్నాయని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే నిజాలు నిగ్గు తేల్చుతామన్నారు. టీడీపీ కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, నాయకులు శ్రీధర్‌వర్మ, విజయలక్ష్మి, యశ్వంత్‌రెడ్డి, రాజయ్య, మునిరామయ్య, మనోహర్ ఆచారి పాల్గొన్నారు.

బడ్జెట్ కొండంత.. ఖర్చు పిసరంత : టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న సుగుణమ్మ

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 8: బడ్జెట్ విషయంలో వైసీపీ ప్రభుత్వం అంకెల గారడీ చేసిందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ విమర్శించారు. బడ్జెట్ కొండంత చూపించి, ఖర్చులు మాత్రం పిసరంత కేటాయించారని అన్నారు. ఇది సంపద సృష్టించలేని బడ్జెట్ అని ఎద్దేవా చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ సంపద, ఆదాయం సృష్టించని ఈ బడ్జెట్ వల్ల ఎవరికీ ఎలాంటి ప్రయోజనమూ లేదన్నారు. రూ.13వేల కోట్ల రెవెన్యూ లోటు ఉన్న ఈ రాష్ట్ర బడ్జెట్‌ను రూ.44వేల కోట్లకు తెచ్చిందన్నారు. రూ.11.58 లక్షల కోట్లు అప్పు చేసి పథకాల పేరుతో రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారని విమర్శించారు. వైసీపీ హయాంలో తీసుకొచ్చిన ప్రతి పథకమూ ఓ స్కామ్‌గా మారిపోయిందని విమర్శించారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రద్దు చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దంపూరి భాస్కర్, టీడీపీ కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, బుల్లెట్ రమణ, ఊట్ల సురేంద్రనాయుడు, కంకణాల రజనీకాంత్‌నాయుడు, మహేష్‌యాదవ్, మునిశేఖర్ రాయల్, కరాటే చంద్ర పాల్గొన్నారు.

'భవిష్యత్తు పరిశోధన' గ్రంథానికి ఎడిటర్‌గా సుధాకరయ్య


సుధాకరయ్యను అభినందిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 8: ప్రపంచంలో భవిష్యత్తు పరిశోధనలు అంశంపై అమెరికాకు చెందిన ఎడోక్సియా రీసెర్చ్ యూనివర్సిటీ ప్రచురించిన గ్రంథానికి ఎస్వీ యూనివర్సిటీ గణిత విభాగ ప్రొఫెసర్ ఎ.సుధాకరయ్య ఎడిటర్‌గా వ్యవహరించారు. ఐఎస్‌బీఎన్-979-8877049369తో ఈ గ్రంథాన్ని ఇటీవల ప్రచురించారు. ఎంతో ప్రాముఖ్యత గల గ్రంథానికి యూనివర్సిటీకి చెందిన సుధాకరయ్య ఎడిటర్‌గా పనిచేయడం అభినందనీయమని వీసీ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

సమస్యలను పరిష్కరించండి


కలెక్టర్‌కు సమస్యలు తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 8: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశాను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు కలిసి విన్నవించారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ఉదయం గంజి నుంచి రకరకాల మెనూలను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా మెనూ ఛార్జీలను పెంచలేదని వాపోయారు. ఇప్పటికే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రూ.3వేలతో పని చేస్తున్నామని, రూ.10వేలకు పెంచాలని కోరారు. కలెక్టర్ స్పందించి ప్రభుత్వానికి విన్నవించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లాజరస్, సుశీల, ఉమ తదితరులు పాల్గొన్నారు.

16నుంచి వ్యవసాయ కాలేజీ కార్మికుల సమ్మె


కార్మికులతో మాట్లాడుతున్న వెంకటేష్

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 8: తిరుపతిలోని వ్యవసాయ కళాశాలలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 16 నుంచి సమ్మెకు దిగుతున్నట్లు ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి జి.నాగవెంకటేష్ తెలిపారు. కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతినెలా జీతాలు, టైంస్కేల్ అమలు, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రసూతి, ప్రభుత్వ సెలవులు అమలు చేయాలని కోరారు. సంఘ అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి రాకేష్, సీఐటీయూ నాయకులు ముకేష్, చంద్రమ్మ, రమ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 8: పద్మావతి వర్సిటీ సెరికల్చర్ విభాగంలో గురువారం వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఐజర్ ప్రొఫెసర్ రాబిన్ వి.విజయన్ మాట్లాడుతూ వన్య ప్రాణులు, క్షీరదాల సంరక్షణకు ప్రత్యేక చర్యలు అవసరమ న్నారు. వీసీ ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మానవాళి అభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ప్రొఫెసర్ మమత పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.59 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.59 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 65,683 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,177 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకయ్యకు అభినందనలు


వెంకయ్యకు శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఫిబ్రవరి 8: పద్మవిభూషణ్ అవార్డు అందుకోనున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడును బీజేపీ నాయకుడు భానుప్రకాష్‌రెడ్డి అభినందించారు. గురువారం భానుప్రకాష్‌రెడ్డి వెంకయ్యనాయుడును ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి దుశ్శాలువతో సత్కరించి, శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

వీలైనంత త్వరగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలి

ఎంపీ గల్లా జయదేవ్‌కు వూకా విజ్ఞప్తి



తిరుపతి (కొర్లగుంట), ఫిబ్రవరి 8: వీలైనంత త్వరగా మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ఎంపీ గల్లా జయదేవ్‌ను టీడీపీ తిరుపతి సీనియర్ నాయకుడు వూకా విజయ్‌కుమార్ కోరారు. ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన సందర్భంగా ఎంపీ గల్లా జయదేవ్‌ను గురువారం రాత్రి ఢిల్లీలో ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవారి ప్రతిమను బహూకరించారు. వూకా మాట్లాడుతూ పది సంవత్సరాల పాటు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని అమరావతి కోసం, రాష్ట్రానికి సంబంధించిన అనేక అంశాలను పార్లమెంటులో తనదైనశైలిలో వినిపించిన ఆయన మాటలను గుర్తు చేసుకున్నారు. మళ్లీ రాజకీయాల్లోకి వచ్చి రాష్ట్రానికి మరిన్ని సేవలందించాలని కోరారు.

కలెక్టరేట్‌లో తనిఖీలు


రెవెన్యూ సెక్షన్‌లో తనిఖీ చేస్తున్న కలెక్టర్

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 8: 'వచ్చేది ఎన్నికల సీజన్.. నిర్లక్ష్యాన్ని వీడి అప్రమత్తంగా విధులు నిర్వహించండి.. లేదంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది..' అంటూ కలెక్టర్ లక్ష్మీశా అధికారులను హెచ్చరించారు. జిల్లాల పునర్విభజన తర్వాత కలెక్టరేట్‌లో అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. ప్రస్తుత కలెక్టర్ గురువారం సాయంత్రం డీఆర్వో పెంచలకిషోర్‌తో కలిసి పలు విభాగాలను తనిఖీ చేశారు. కొంతమంది ఉద్యోగుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'గతంలో ఎలా ఉన్నారో నాకొద్దు... విధి నిర్వహణలో ప్రతిభ కనబరచాలి.. ఫైల్స్ నిర్వహణలో పెండింగ్ ఉండకూడదు.. నిర్దేశించిన సమయానికి కార్యాలయానికి రావాలి. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీపడొద్దు' అంటూ సూచించారు. పలు విభాగాల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో ఒకింత ఆగ్రహం, అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడు రోజుల్లోపు సూచికబోర్డులు ఉండాలని ఆదేశించారు.

జర్మన్ భాషపై శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 8: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, గాక్-గో జర్మని సంయుక్త ఆధ్వర్యంలో ఏఎస్ఎం, జీఎస్ఎం, బీఎస్సీ, ఎమ్మెస్సీ, నర్సింగ్ చదువుతున్న వారికి జర్మనీ భాషను నేర్పించి, వారు జర్మని దేశంలో నర్సులుగా అవకాశం కల్పించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. ఈ మేరకు గురువారం పోస్టర్లను విడుదల చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం మాట్లాడుతూ అభ్యర్థులు జర్మనీలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని, నర్సింగ్ గ్రాడ్యుయేట్ లేదా జీఎన్ఎం, ఏఎన్ఎం, చివరి సంవత్సరం చదువుతున్న వారు అర్హులని పేర్కొన్నారు. 20-35లోపు వయసు ఉండాలని చెప్పారు. శిక్షణ, వసతి, ఇతర సదుపాయాలపై ప్రభుత్వం 50 శాతం భరిస్తుందని వివరించారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 12వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9505353545, 9988853335లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్యాక్‌గో జర్మనీ ప్రతినిధి దిలీప్, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి రూ.10,01,000 విరాళం


స్విమ్స్ డైరెక్టర్‌కు డీడీ అందజేస్తున్న కంపెనీ ప్రతినిధి రాఘవేంద్ర

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 8 : స్విమ్స్‌లో పేదలకు ఉచిత వైద్యం అందించే శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి చెన్నైకు చెందిన సీఎంజీ స్టీల్స్ కంపెనీ రూ.10,01,000 విరాళంగా అందించింది. ఈ మేరకు తిరుపతికి చెందిన ఆ కంపెనీ ప్రతినిధి రాఘవేంద్ర గురువారం స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్‌ను డైరెక్టర్ ఛాంబర్‌లో కలిసి డీడీని అందజేశారు. పేదల వైద్య సేవల కోసం ఈ నగదు వినియోగించాలని కోరారు. డైరెక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ పేదలకు వైద్యం అందించేందుకు సహకరించిన సీఎంజీ స్టీల్స్ కంపెనీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అగ్రోవెట్‌తో పద్మావతి వర్సిటీ ఒప్పందం


ఒప్పంద పత్రాలతో ఇరు సంస్థల అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 8: పట్టు ఉత్పాదకత పెంపొందించే లక్ష్యంతో రెయిన్‌బో అగ్రోవెట్ సంస్థతో పద్మావతి మహిళా యూనివర్సిటీ ఒప్పందం చేసుకుంది. ఇందుకు సంబంధించిన పత్రాలపై ఇరు సంస్థల అధికారులు గురువారం సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రోవెట్ ఎండీ సుబ్బరాయుడు, డీన్ సుజాత, హెడ్ మమత, అధ్యాపకులు సావిత్రి, విజయకుమారి పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చేసి రూ.1.05 లక్షలు కొట్టేశాడు!

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 8: ఏటీఎం కార్డు మార్చేసి రూ.1.05లక్షలు చోరీ చేసిన సంఘటన గురువారం వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. పెళ్లకూరు మండలం చెంబడిపాళెం గ్రామానికి చెందిన సురేష్ ఈనెల ఆరో తేదీన నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఏటీఎం వద్దకెళ్లాడు. తన వద్ద ఉన్న ఏటీఎం కార్డు ద్వారా నగదు తీసుకోవడానికి ప్రయత్నించాడు. నగదు రాకపోవడంతో ఏటీఎం నుంచి బయటకు వస్తున్నాడు. ఇంతలో వెనుక ఉన్న ఓ వ్యక్తి తాను నగదును డ్రా చేయిస్తానని చెప్పి, కార్డును తీసుకున్నాడు. డ్రా చేస్తున్నట్లు నమ్మించి వేరే ఏటీఎంకార్డును సురేష్‌కిచ్చాడు. అప్పటికే పిన్ నెంబరు తెలుసుకోవడంతో సురేష్ బ్యాంకు ఖాతా నుంచి పలు దఫాలుగా రూ.1.05లక్షలను డ్రా చేసేశాడు. మరోవైపు తన ఖాతాలో డబ్బులున్నా ఏటీఎం నుంచి నగదు రావడం లేదంటూ బాధితుడు బ్యాంకుకు వెళ్లి వివరాలు ఆరా తీశాడు. దాంతో నగదు డ్రా చేసిన విషయం బయటపడింది. దాంతో లబోదిబోమంటూ నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు



కరుణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

గూడూరు, ఫిబ్రవరి 8: మండల పరిధిలో ప్రశాంతవాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపడతానని తహసీల్దారు కరుణ్‌కుమార్ అన్నారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈయన పల్నాడుజిల్లా దాచేపల్లి నుంచి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించాక బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. సిబ్బంది శివకుమార్, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లురాజు, హనుమంతయ్య, పుల్లయ్య, చెంచయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఇక్కడ తహసీల్దారుగా ఉన్న లీలారాణి అన్నమయ్యజిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే.

జ్యుడీషియల్ ఇన్‌చార్జి మెజిస్ట్రేట్‌గా ప్రకృతి కుమార్



వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 8: వెంకటగిరి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఇన్‌చార్జిగా ఏపీపీ ప్రకృతి కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. శుక్రవారం ఆయన బాధ్యతలు తీసుకోనున్నారని సమాచారం.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంవీఐ సునీల్

గూడూరు, ఫిబ్రవరి 8: వాహనదారులు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరగవని ఎంవీఐ సునీల్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఎల్‌ఏపీ పాఠశాలలో ఆటోడ్రైవర్లకు, విద్యాసంస్థల వాహనాల డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



చిల్లకూరులో వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న అంగన్వాడీ సిబ్బంది

చిల్లకూరు, ఫిబ్రవరి 8: బాల్య వివాహాలను అరికట్టడానికి అందరూ కృషి చేయాలని సీడీపీవో మెహబూబి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో బాలవివాహాలపై అంగన్వాడీ సిబ్బందికి, మహిళా పోలీసులకు అవగాహన కల్పించి, వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. రేణుక, శివజ్యోతి, ఆదినారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగుల ఇళ్లపట్టాలకు పల్లంలో భూసేకరణ

- భూములను పరిశీలించిన ఏర్పేడు తహసీల్దారు
- యుద్ధప్రతిపాదికన సర్వే పనులు ప్రారంభం



పల్లం వద్ద సేకరించనున్న భూమి ఇది

ఏర్పేడు, ఫిబ్రవరి 8: టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం ఏర్పేడు మండలం పల్లం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 390 నుంచి 470 వరకు సుమారు 400 ఎకరాలను సేకరిస్తున్నారు. ఏర్పేడు తహసీల్దారు ఉదయ్ భాస్కర్‌రాజు గురువారం సాయంత్రం మండల సర్వేయర్ ప్రసాద్ ఆధ్వర్యంలో సర్వే పనులు యుద్ధప్రతిపాదికన చేపట్టారు. పల్లం రెవెన్యూ పరిధిలో పల్లం దళితవాడ, పల్లం పేట దళితవాడ, పల్లంపేట గిరిజన కాలనీ, గొల్లపల్లి గిరిజనకాలనీలో 320మంది రైతులకు భూములు ఉన్నాయి. 20 ఏళ్ల కిందట దళితులు, గిరిజనులకు అప్పటి ప్రభుత్వం ఒక కుటుంబానికి ఒకటిన్నర ఎకరా చొప్పున భూమిని పంపిణీ చేసింది. అప్పటి నుంచి రైతులు ఆ భూములను సాగు చేసుకుంటున్నారు. వర్షాధార పంటలను పండించుకుంటున్నారు. ప్రస్తుతం ఈ భూముల్లో మినుము సాగులో ఉంది. ఇప్పటికే 200మంది రైతులకు భూములు తీసుకుంటున్నట్లు రెవెన్యూశాఖ తరపున నోటీసులు ఇచ్చారు. మిగిలిన రైతులకు కూడా రెండు మూడు రోజుల్లో నోటీసులు అందించనుంది. ఎకరాకు రూ.20లక్షల వరకు రైతులకు నష్ట పరిహారం అందించనున్నట్లు తెలుస్తోంది.

నేడు కలెక్టర్ పరిశీలన: కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం పల్లం రెవెన్యూ పరిధిలోని భూములను పరిశీలిం చనున్నారు. అనంతరం రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు చెల్లించే పరిహారంపై చర్చిస్తామని తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు తెలిపారు.

వైసీపీ నాయకుల ప్రోద్భలంతోనే..: కొంతమంది గిరిజనుల వద్ద అధికార వైసీపీ నాయకులు తక్కువ మొత్తం చెల్లించి భూములను కొనుగోలు చేశారని, ఇప్పుడు వారి ప్రోద్భలంతో ఈ ప్రాంతంలో భూసేకరణ చేస్తున్నట్లు మండలంలో ప్రచారం సాగుతోంది.

మసీదులు, ఈద్గాల అభివృద్ధికి ప్రణాళికలు

కోట, ఫిబ్రవరి 8: మసీదులు, ఈద్గాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఆలీ కోరారు. శ్యామసుందరపురంలోని మదీనా మసీదులో గురువారం జరిగిన గూడూరు నియోజకవర్గస్థాయి ముత్తవల్లుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ముత్తవల్లుల కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు మోబిన్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి 82 మసీదుల ముత్తవలు హాజరయ్యారు. నిరుపేద ముస్లింల కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. కమిటీ ఉపాధ్యక్షుడు రహీమ్, కార్యదర్శి అమీర్, జిలానీ, మస్తాన్‌బాషా, రియాజ్, హిదాయతుల్లా, నజీర్, అమీరుద్దీన్, ఇలియాజ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ సాగులో తెగుళ్లపై అవగాహన

పెళ్లకూరు, ఫిబ్రవరి 8: నిమ్మ తోటల సాగులో తెగుళ్ల నివారణపై రైతులకు ఉద్యాన శాఖాధికారి శారద అవగాహన కల్పించి, పలు సూచనలిచ్చారు. గురువారం కానూరు పరిధిలోని నిమ్మతోటలను పరిశీలించారు. హార్టికల్చర్ అసిస్టెంట్ శ్రీరాములు, రైతులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన

వాకాడు, ఫిబ్రవరి 8: చిన్నతోట గ్రామంలో కుష్ఠువ్యాధి నివారణపై గురువారం అడిషనల్ డీఎంహెచ్‌వో అరుణసులోచనదేవి.. అవగాహన సదస్సు నిర్వహించారు. శరీరంపై స్పర్శ లేఏని మచ్చలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం నిడిగుర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, చిట్టమూరు మండలంలోని మల్లాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో వైద్యులు దీప్తి, రామకృష్ణ, శ్రీనివాసులు, మదన్‌మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన వైసీపీ



స్థానికులతో మాట్లాడుతున్న సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 8: జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని యువతను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. గురువారం సాధుపేటలో బాబుషూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటి ప్రచారం నిర్వహించారు. ఉపాధి అవకాశాలు రావాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. నరసింహులునాయుడు, చంద్రమౌళి, మోహన్, శ్రీధర్, రమేష్, రత్నం, బిల్లు చెంచు రామయ్య, రవీంద్రరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, గాయం రమణయ్య, అమరయ్య, గురవయ్య, గుండాల లీలావతి, కల్పన సుధా, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

యల్లసిరిలో భవిష్యత్తుకు గ్యారెంటీ



చిట్టమూరు, ఫిబ్రవరి 8: యల్లసిరి గ్రామంలో గురువారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. పాశిం సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, చంద్రబాబును సీఎం చేసుకోవాలని కోరారు. టీడీపీ కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యకమంలో నాయకులు కాపులూరు చెంచురామయ్య ఆచారి, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, గుంపర్ల చిన్నారావు, కల్లూరు మణి, నాగూరయ్య, వెంకటరమణయ్య, మురళీధర్, దేవుడు, శివారెడ్డి, శ్రావణ్, అంకయ్య, కుమార్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ అంతా అంకెల గారడీనే: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 8: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడీనే అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమీ లేవన్నారు. పైగా రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా సీఎం జగన్ మార్చేశారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పి టీడీపీని గెలిపించాలన్నారు. బిల్లు చెంచు రామయ్య, ఇశ్రాయిల్ కుమార్, నరసింహులు, శ్రీనివాసులు, సద్దాం, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల భారం: నెలవల

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 8: వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో



మీడియాతో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

పన్నుల భారం తప్ప కొత్తగా తెచ్చిన అంశాలు లేవని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం విమర్శించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. అప్పులు చేశారు కానీ, అభివృద్ధి కానరావడం లేదన్నారు. ప్రభుత్వ అసమర్థత, అవివేకం వల్ల రాష్ట్రంలోని అధికారులు న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ నాయకులు గూడూరు సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్, ముసులూరు శ్రీనివాసులు, ప్రసాద్‌రాజు, బల్లి ముత్యాలయ్య, వెంకటేశ్వర్లు, నాగేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్

గూడూరు, ఫిబ్రవరి 8: పట్టణంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో గురువారం టీడీపీ ఆధ్వర్యంలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ.. టీడీపీకే ఓటు ఎందుకు వేయాలో విద్యార్థులకు వివరించడం జరిగిందన్నారు. చంద్రబాబు ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయడంతో ఎంతోమంది విద్యార్థులు ఉన్నత ఉద్యోగావకాశాలు పొంది, ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహించేది టీడీపీయే అన్నారు. మట్టం శ్రావణి, గుండాల లీలావతి, ప్రణీత్, దయాకర్, సునీల్, సందీప్, జీవన్, వెంకటసాయి, వెంకటేష్, కళ్యాణ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీడీపీ నేతలు

'టికెట్ల కేటాయింపుల్లో బీసీలకు ప్రాధాన్యమివ్వాలి'





మీడియాతో మాట్లాడుతున్న బీసీ నాయకులు

వెంకటగిరి, ఫిబ్రవరి 8: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో, కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాలో ప్రధాన పార్టీలన్నీ టికెట్ల కేటాయింపుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని బీసీ వెల్ఫేర్ జేఏసీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు బొమ్మి నాగకిషోర్ యాదవ్ కోరారు. గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో బీసీలపై ఎనలేని అభిమానం చూపిస్తారే తప్ప చట్టసభల్లో అవకాశం మాత్రం అగ్రకులాలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా, తిరుపతి జిల్లాలో కనీసం ఒక్క సీటైనా బీసీలకు కేటాయించలేదని వాపోయారు. వెంకటగిరి నుంచి బీసీ అభ్యర్థికి అవకాశం కల్పించాలని కోరారు. బీసీ నాయకులు సామా గోపాల్, బెల్లంకొండ చిన్నయ్య, మధుసూదన్, రామచంద్రయ్య, గూడూరు వెంకటేశ్వర్లు, భాస్కర్ గౌడ్, సిసింద్రి యాదవ్, గరిట చెంచయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చనిపోయినా.. ఊరొదిలి వెళ్లినా ఓటర్లే..!

- తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లిన టీడీపీ నాయకులు





వాకాడు, ఫిబ్రవరి 8: మండలంలోని కొండాపురం పంచాయతీ బూత్ నెంబరు 254లో వలిపి రమణయ్య (ఓటరు ఐడీ నెంబరు జీఎల్‌డబ్ల్యూ 2693208) పదేళ్ల క్రిందట మృతి చెందారు. పేరు తొలగించాలని కుటుంబసభ్యులు, బీఎల్‌వోలకు ఫారం-7ను అందజేశారు. ఇప్పటికీ ఓటరు జాబితాలో ఓటుంది. అదే బూత్ నెంబరులోని 811 ఇంటి నెంబరులో బెల్లంకొండ రమణయ్య (ఓటరు ఐడీ జీఎల్‌డబ్ల్యూ 2688570) రెండేళ్లక్రిందట మృతి చెందారు. ఆయన పేరు కొత్తగా విడుదలైన ఓటరు జాబితాలో ఉంది. ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారినీ పట్టించుకోలేదు. కొండాపురం పంచాయతీ బూత్ నెంబరు 254లోని చల్లా రమణయ్య (ఓటరు ఐడీ జీఎల్‌డబ్ల్యూ 2688174) పదేళ్ల కిందటే ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పటికి ఆయన పేరు ఓటు జాబితాలో ఉంది. ఇలా పోలింగ్ బూత్ నెంబరు 254లో 57 మంది మృతిచెంది, ఇతర ప్రాంతాలకు వెళ్లినవారి ఫారం-7 ధ్రువపత్రాలను అధికారులకు అందజేసినప్పటికీ ఏ ఒక్కరిపేరు తొలగించలేదు. దీనివల్ల వైసీపీ నాయకులు దొంగ ఓట్లు వేసే అవకాశం ఉందంటూ తహసీల్దారు నరసింహరావు దృష్టికి గురువారం టీడీపీ నాయకుడు తుమ్మల మోహన్‌నాయుడు తీసుకెళ్లారు. ఆయనవెంట పార్టీ నేతలు మన్నెపల్లి వేణునాయుడు, గోపీనాయుడు తదితరులు ఉన్నారు.

ఆటో ఢీకొని మహిళకు తీవ్రగాయాలు



బోల్తా పడిన ఆటో

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8: ఆటో ఢీకొని ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎన్వీ కండ్రిగకు చెందిన లత తన బంధువు వెంకటసుబ్బయ్యతో కలిసి గురువారం ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో వద్దకొచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వస్తున్న ఆటో వీరి వాహనాన్ని ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లత తలకు తీవ్రగాయాలవడంతో సూళ్లూరుపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తీసుకెళ్లారు. బోల్తాపడ్డ ఆటోలో డ్రైవర్ ఒక్కడే ఉన్నా.. సురక్షితంగా బయట పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఎక్స్‌కవేటర్ల సీజ్

చిల్లకూరు, ఫిబ్రవరి 8: రెండు ఎక్స్‌కవేటర్లను గురువారం విజిలెన్స్, మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. మైనింగ్ విజిలెన్స్ అధికారి బాలాజీనాయక్ మాట్లాడుతూ.. ఎటాంటి అనుమతులు లేకుండా స్థానిక పోలీస్‌స్టేషన్ వెనుకఉన్నలేఅవుట్‌కు అక్రమంగా గ్రావెల్ తరలించి, చదును చేస్తుండగా, రెండు ఎక్స్‌కవేటర్లను సీజ్ చేశామన్నారు. అనుమతుల్లేకుండా గ్రావెల్ రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ వాహనాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీపై ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 8: ఎన్‌ఎస్‌ఆర్ కాలనీలో ద్విచక్ర వాహనం చోరీపై పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశాడు. కాలనీలో నివాసం ఉంటున్న అయ్యప్ప జనవరి 20వ తేదీ రాత్రి ఇంటి ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనం ఉదయం చూసేసరికి కనిపించ లేదు. అప్పటినుంచి పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మైనింగ్ అధికారుల విస్తృత దాడులు

- ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో కదలిక
- రెండ్రోజుల్లో 11 టిప్పర్ల స్వాధీనం

పెళ్లకూరు, ఫిబ్రవరి 8: మండలంలో విచ్చల విడిగా సాగుతున్న గ్రావెల్ అక్రమ రవాణాపై మైనింగ్ అధికారులు విస్తృతంగా దాడులు చేస్తున్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణాపై ప్రచురితమైన వరుస కథనాలతో అధికారులు స్పందించారు. బుధవారం సాయంత్రం శిరసనంబేడు నుంచి గ్రావెల్ తరలిస్తున్న ఆరు టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు అప్పజెప్పిన విషయం తెలిసిందే. గురువారం సాయంత్రం మరోసారి రోసనూరులో దాడులు నిర్వహించి గ్రావెల్ తరలిస్తున్న ఐదు టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు అప్పగించిన్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా
అడ్డుకోవాలంటున్న స్థానికులు

చిల్లకూరు సమీపంలోని స్వర్ణముఖినది నుంచి ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను ట్రాక్టర్లలో నింపి అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీన్ని అధికారులు అడ్డుకోవాలని కోరుతున్నారు.

పుత్తూరు వార్తలు

రోడ్డు, డ్రైనేజీ సమస్యపై పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు, ఫిబ్రవరి 8: రైల్వే స్థలంలో ఉన్న వేపగుంట- అక్కేరి గ్రామాల రోడ్డు, డ్రైనేజీల సమస్యను రైల్వే అధికారులతో కలిసి గురువారం మంత్రి రోజా పరిశీలించారు. పుత్తూరు మండలంలోని ఈ రెండు గ్రామాల రోడ్డు, డ్రైనేజీలు రైల్వేలైను కట్టకు పక్కనే ఉందని అన్నారు. అందువల్ల రైల్వే అధికారుల అభ్యంతరంతో ఈ సమస్య చాలాకాలంగా పెండింగులో ఉందని చెప్పారు. ప్రజల ఇబ్బందులను రైల్వే అధికారులతో చర్చించడంతో ఆ మేరకు స్థలాన్ని మినహాయించేందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రైలు బోగీల్లో పోలీసుల తనిఖీలు




రైలు బోగీలో జాగిలంతో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పుత్తూరు, ఫిబ్రవరి 8: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలతో రైల్వే పోలీసులు గురువారం పుత్తూరు రైల్వేస్టేషన్‌లో చెన్నై-తిరుపతి యూనిట్ రైలు బోగీలను జాగిలంతో తనిఖీలు చేశారు. డీఎస్పీ షేక్ ఛాను మాట్లాడుతూ.. నిషేధిత వస్తువులు, పరిమితికి మించి నగదు రవాణా చేయంకూడదని చెప్పారు. రైళ్లతోపాటు స్టేషన్ పరిసర ప్రాంతాలను తరచూ తనిఖీ చేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ దేవేంద్రకుమార్, ఎస్‌ఐ రవి, హరినాథరాజు, శివకుమార్, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

గుట్ట పోరంబోకును ఆక్రమిస్తున్నారు!

భూమి చదును పనులను అడ్డుకున్న ఎస్టీ కాలనీ మహిళలు






ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి వద్ద ఎస్టీ కాలనీ మహిళల నిరసన

వడమాలపేట, ఫిబ్రవరి 8: బాలినాయుడు కండ్రిగ పంచాయతీ బంగారెడ్డి కండ్రిగ సమీపంలోని గుట్ట పోరంబోకును కొందరు ఆక్రమిస్తున్నారంటూ బంగారెడ్డి కండ్రిగ ఎస్టీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. పది రోజులుగా గుట్ట పోరంబోకు భూమిని చదును చేస్తున్నారంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఎవరూ పట్టించుకోక పోవడంతో గురువారం కాలనీకి చెందిన మహిళలు సంఘటనా స్థలానికి వెళ్లారు. భూమిని చదును చేస్తున్న యంత్రాలను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. సుమారు 50 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమిని ఎక్స్‌కవేటర్లతో చదును చేస్తున్నా అధికారులు పట్టించుకోక పోవడం సరికాదన్నారు. శ్మశాన స్థలాన్ని కూడా ఆక్రమించారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఎక్స్‌కవేటర్ల రాకపోకలతో పైపులు పగిలి తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. 20 కుటుంబాలున్న తమకు సెంటు భూమి కూడా లేదని, ఆక్రమించిన భూమిని స్వాధీనం చేసుకుని తమకు జీవనోపాధి నిమిత్తం పట్టాలివ్వాలని కోరారు. ఇకనైనా ఆక్రమణలను అడ్డుకోకుంటే రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

బాదుడు తప్ప.. బడ్జెట్‌లో ఏముంది?

నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్



పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 8: పన్నుల బాదుడు తప్ప.. బడ్జెట్‌లో ఏముందని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ప్రశ్నించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ కర్ర విడిచి సాము చేసిన చందాన ఉందని దుయ్యబట్టారు. రూపాయి రాక ఎక్కడ నుంచి వస్తుందనే విషయాన్ని స్పష్టంగా చెప్పకుండానే రూ.రెండున్నర లక్షల కోట్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టి అంకెల గారడీని చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతసేపు మద్యం నుంచి వచ్చే ఆదాయం, అప్పులు తీసుకురావడం తప్ప.. సంపద సృష్టికి ఎలాంటి కసరత్తు చేయలేదని మండిపడ్డారు. ఇక నిరుద్యోగులను దగా చేసేందుకే డీఎస్సీ ప్రకటించారని, ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో బడ్జెట్‌లో ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. రైతులు, డ్వాక్రా సంఘాలకు బడ్జెట్‌లో ఏ మాత్రం ప్రాధాన్యం ఇవ్వకపోవడం దారుణమన్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను కూడా రద్దు చేసి జగన్ ప్రభుత్వం పేదింటి గర్భిణులకు తీరని ద్రోహం చేసిందన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజాసమస్యల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదనే విషయాన్ని బడ్జెట్ ద్వారా మరోసారి నిరూపించుకున్నారని ఎద్దేవా చేశారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న బీఎల్వోపై చర్యలు తీసుకోండి: టీడీపీ



కమిషనర్‌కి వినతిపత్రం సమర్పిస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 8: ఏకపక్షంగా వ్యవహరిస్తున్న బీఎల్వో తేజస్వినిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పుత్తూరు మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డిని పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ బూత్ నెంబరు 41లో.. వివాహం చేసుకుని వెళ్లిపోయిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని బీఎల్వోకి పలుమార్లు అభ్యర్థించినట్లు చెప్పారు. అయినా ఆమె ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఓటరు జాబితాలో సుమారు 19 మంది అనర్హులకు ఓటును కొనసాగించేలా వ్యవహరించారన్నారు. అధికార పార్టీకి వత్తాసు పలికేలా విధులు నిర్వహిస్తోందని ఆరోపించారు. విచారణ జరిపి అనర్హుల ఓట్లు తొలగింపుతోపాటు వివాదాస్పదంగా వ్యవహరిస్తున్న బీఎల్వోపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు, జిల్లా రిటర్నింగ్ అధికారికి కూడా ఆధారాలతోసహా ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నాయకులు డీఎస్ గణేష్, యుగంధర్, ఆనంద్, ధనపాల్, రాధా అశోక్, ఏలుమలైరెడ్డి, హరి, అయ్యప్పన్, లక్ష్మీపతి, నాగరాజు, చిదంబరం తదితరులున్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8: ముక్కంటి ఆలయంలో వెలసిన గురుదక్షిణా మూర్తికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గురు దక్షిణామూర్తి సన్నిధిని శుద్ధిచేశారు. శాస్త్రోక్తంగా కలశస్థాపన చేసి భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వర్ణకవచాలంకృతంగా అలంకరించారు. పసుపువర్ణ పూలు, ముడిశెనగల దండలను భక్తులు సమర్పించారు. వేదమంత్రాలు నడుమ ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



వరదయ్య పాళెం, ఫిబ్రవరి 8: వరదయ్యపాళెం మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన ఉదయ భారతి గురువారం పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాండూరు, తొండంబట్టు, ఇంద్రానగర్, కురింజలం గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, వీఆర్వో నాగేంద్ర పాల్గొన్నారు.

కరకంబాడి గుట్టపై ట్రెంచ్‌లు తీయండి: ఆర్డీవో

రేణిగుంట, ఫిబ్రవరి 8: కరకంబాడి గుట్టపై వాహనాలు వెళ్లకుండా ట్రెంచ్‌లు తీయాలని ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. కరకంబాడి పంచాయతీ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబర్ 153/1లో ఉన్న స్థలాన్ని ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. కొన్ని రోజులుగా ఈ గుట్టపై సమీప గ్రామాలలోని పేదలు ఇంటి స్థలాలు చూపాలని కోరుతూ తాత్కాలిక గుడిసెలు వేశారు. అదే సమయంలో ఈ స్థలం తనదేనని రవిబాబు అనే వ్యక్తి అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆర్డీవో పరిశీలించారు.

రామక్రిష్ణాపురంలో ఘనంగా గంధోత్సవం



రేణిగుంట, ఫిబ్రవరి 8: మండలంలోని గురవరాజు పల్లి పంచాయతీ రావ ఎ్రకి ష్ణాపురంలో గురువారం నాగూర్‌లోని ఖాదర్‌వల్లిబాబా నిషాన్ వద్ద గంధోత్సవం జరిగింది. నిషాన్ వద్ద ముస్లింలు, హిందువులు భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక వాయిద్యాలు, జెండాల నడుమ గంధాన్ని పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం పేదలకు అన్నసమర్పణ చేశారు. సాయంత్రం నిషాన్ వద్ద ముస్లిం మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సర్పంచ్, రహీమ్ తదితరులు ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మునిక్రిష్ణ, మస్తాన్, మునిక్రిష్ణ, చాంద్‌బాషా, ఇస్మాయిల్, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే నాలక్ష్యం



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న సుబ్రమణ్యం

రేణిగుంట, ఫిబ్రవరి 8: విప్పమాను పట్టెడ గ్రామాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ, వేమాపురం సంజీవిరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. గురువారం పంచాయతీ పరిధిలోని వేమాపురం సంజీవిరెడ్డి కాలనీలో ఆధునీకరించిన గ్రామపంచాయతీ భవనాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో ప్రజల సంక్షేమం, అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీల్ చైర్ వితరణ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రానికి కాపు సంక్షేమ సేన పట్టణ అధ్యక్షులు పసుపులేటి నవీన్‌కుమార్ వీల్ చైర్ వితరణ చేశారు. ఈ మేరకు గురువారం డయాలసిస్ కేంద్రం నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్‌కుమార్, కంటా సుబ్బు, గిరి, కళ్యాణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం.. భర్త అరెస్టు

కేవీబీపురం, ఫిబ్రవరి8: మండలంలోని కస్తూరిపురం గిరిజన కాలనీలో రత్నమ్మపై హత్యాయత్నం చేసిన భర్త చంద్రయ్యను (45) పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం రాత్రి నిద్రిస్తున్న భార్యపై కత్తితో దాడిచేసిన పరారైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులకు నిందితుడు ఓళ్లూరు అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు సమాచారం అందింది. ఆ మేరకు ఎస్ఐ సునీల్, ఏఎస్ఐ లోకనాథం సిబ్బందితో వెళ్లి అతడిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

దుకాణం దగ్ధం

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 8: వరదయ్యపాళెం మండలం మత్తేరిమిట్ట గ్రామం దళితవాడలో విద్యుదాఘాతంతో కవల గురవయ్యకు చెందిన బంకు దుకాణం పూర్తిగా దగ్ధమైంది. బుధవారం రాత్రి 9 గంటలకు దుకాణం మూసుకుని గురవయ్య ఇంటికి వెళ్లాడు. తరువాత షార్ట్ సర్క్యూట్‌తో ఒకసారిగా దుకాణంలో మంటలు చెలరేగాయి. స్థానికులతో కలిసి మంటలు అదుపుచేసేలోపే ఫ్రిజ్, కిరాణా సరుకులు కాలిపోయాయి. సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

గుండెపోటుతో గుర్తుతెలియని యువకుడి మృతి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8: గుండెపోటుతో గుర్తు తెలియని యువకుడు(32) మృతిచెందాడు. ఈ ఘటన గురువారం శ్రీకాళహస్తిలో చోటుచేసుకుంది. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గుర్తుతెలియని యువకుడు నడిచి వెళుతూ ఓ దుకాణం ఎదుట బైఠాయించాడు. తనకు చాతిలో నొప్పి ఉందంటూ తమిళంలో చెబుతూ హఠాత్తుగా కుప్పకూలి చనిపోయాడు. వన్ టౌన్ పోలీసులు అతడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలూ లభ్యం కాలేదు.

నేడు తై అమావాస్య ఉత్సవం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8: శ్రీకాళహస్తీశ్వరాలయంలో తై అమావాస్య పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం విశేష ఉత్సవం నిర్వహించనున్నారు. ప్రతి సంవత్సరంలాగే ఉదయం అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లను విశేషంగా అలంకరించి భరద్వాజ తీర్థం వరకు ఊరేగిస్తారు. భరద్వాజతీర్థంలో విశేష అభిషేకాలు పూజలు నిర్వహిస్తారు. ఆ తర్వాత ముక్కంటి ఆలయ ప్రాంగణంలోని బ్రహ్మగుడిలో స్వామి అమ్మవార్లను కొలువు దీర్చనున్నారు. సాయంత్రం అక్కడి నుంచి చతుర్మాడ వీధిలో నగరోత్సవంలో భక్తులను అనుగ్రహించనున్నారు.

అజాగ్రత్తతోనే రోడ్డు ప్రమాదాలు



విద్యార్థులను అభినందిస్తున్న డీఎం రాజువర్ధన్ రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8: అజాగ్రత్తతోనే అధికశాతం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయని శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజువర్ధన్ అన్నారు. పట్టణంలోని ది స్కూల్లో గురువారం రోడ్డు భద్రత అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన కోమల, శంకర్, లలిత అనే విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తర్వాత మూడు స్థానాల్లో నిలిచిన మరో ముగ్గురు విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ జనార్థన్‌రావు పవర్ ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిపో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశాల తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వైసీపీ అరాచకాలకు అంతం పలకండి: జనసేన



జనసైనికులతో కలిసి ప్రచారం చేస్తున్న కోట వినుత

తొట్టంబేడు, ఫిబ్రవరి 8: వైసీపీ ప్రభుత్వ అరాచకాలకు అంతం పలకాలని జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత కోరారు. మండలంలోని తొట్టంబేడు పంచాయతీ రామచంద్రాపురంలో 'జనసేన విజయ యాత్ర.. ఏపీ నీడ్స్ పవన్' కార్యక్రమం గురువారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి పేట చంద్రశేఖర్, నాయుకులు కావలి శివకుమార్, గణేష్, రవికుమార్ రెడ్డి, లక్ష్మి, కవిత, నాథముని, శారద, రాజ్యలక్ష్మి, హేమంత్‌గౌడ్, జనసైనికులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్చండి

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 8: చదువు మధ్యలో మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్చాలని ఎంఈవో రవీంద్రనాథ్ కోరారు. మండలంలోని పాటిమిట్ట గిరిజన కాలనీలో బడి మానేసిన గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతపై ఎంఈవో అవగాహన కల్పించారు. చదువుతోనే మంచి జీవితం ఉంటుందని తెలియజేశారు. ప్రభుత్వం ఉచిత భోజనం, పుస్తకాలు, దుస్తులు అందజేస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు.

మామిడి రైతులకు సూచనలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 8: గాజులు పెళ్లూరు, కుక్కంబాకం గ్రామాల్లోని మామిడి తోటలను ఉద్యానవన శాఖాధికారి యామిని గురువారం పరిశీలించారు. రైతులకు సూచనలు చేశారు. మామిడి, మిరప పంటలకు సంబంధించిన తెగుళ్లు ఇతర వివరాలకు 7995088941 నెంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు ఐఐటీని సందర్శించనున్న కలెక్టర్

ఏర్పేడు, ఫిబ్రవరి 8: తిరుపతి ఐఐటీ ప్రాంగణాన్ని కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం సందర్శించనున్నారు. మార్చి నెలాఖరు లోపు ఐఐటీ నిర్మాణ పనులు పూర్తి కావాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో కలెక్టర్ ఐఐటీని సందర్శించనున్నారు. అలాగే ఐసర్‌ను సందర్శిస్తారని తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు తెలిపారు.

హమాలీకి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8: రోడ్డు ప్రమాదంలో వెంకటస్వామి (28) అనే హమాలీ తీవ్ర గాయాలపాలయ్యాడు. శ్రీకాళహస్తి మండలం పెంకులపాడు గ్రామానికి చెందిన వెంకటస్వామి పట్టణంలోని ఏపీ సీడ్స్‌లో హమాలీగా పని చేస్తుంటాడు. సాయంత్రం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. పట్టణంలోని పానగల్ మలుపు వద్ద గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతిలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు.

గుడిమల్లంలో వైసీపీ ప్రచారం

ఏర్పేడు, ఫిబ్రవరి 8: గుడిమల్లం గ్రామంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి వైసీపీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నరసింహయాదవ్, దినేష్ యాదవ్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పది మద్యం సీసాల స్వాధీనం

ఏర్పేడు, ఫిబ్రవరి 8: ఏర్పేడు మండలంలోని ఆమందూరు బీసీ కాలనీలో పోలీసులు గురువారం పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రేత రాజన్నను అదుపులోకి తీసుకున్నారు.

మద్యం కేసులో మహిళ అరెస్టు

కేవీబీపురం, ఫిబ్రవరి8: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో గురువారం ఓళ్లూరు గ్రామానికి చెందిన ఓ మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. ఆమెనుంచి 15మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సునీల్ కేసు నమోదు చేశారు.

పేదల సంక్షేమమే బీజేపీ లక్ష్యం

తొట్టంబేడు, ఫిబ్రవరి 8: పేదల సంక్షేమమే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ కో-కన్వీనర్ మేళాగరం సుబ్రమణ్యం రెడ్డి అన్నారు. మండలంలోని గొట్టిపూడి గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను, క్యాలండర్లను పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు క్రిష్ణయ్య, రవిఆచ్చారి, మునిరాజ, రవిచంద్ర, బిందుకుమార్, లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రాస్ రైతు రుణాల పంపిణీ

ఏర్పేడు, ఫిబ్రవరి 8: మండలంలోని 123 మంది రైతులకు రూ.68.4లక్షల రుణాలను రాస్ నిర్వాహకులు పంపిణీ చేశారు. పాపానాయుడుపేటలో రాస్ మహిళాభారతి కార్యాలయంలోని రాస్ సేవా నిలయంలో రైతు రుణమేళా, వ్యవసాయ మెలకువలు గురించి అవగాహన కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా రైతులకు రుణాలు మంజూరు చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్టు డాక్టర్ శ్రీనివాసులు, రాస్ మహిళా భారతి ఫీల్డ్ అధికారి వెంకట్‌కుమార్, మునిపార్థసారథి, రుణవిభాగం మేనేజరు మునీంద్ర, ఆఫీస్ అసిస్టెంట్ తిరుపాల్ పాల్గొన్నారు.

పూర్వప్రాథమిక విద్యపై కళాజాతా

ఏర్పేడు, ఫిబ్రవరి 8: ఏర్పేడు మండలం చిందేపల్లి, కొత్తవీరాపురం, వెంకట పాళెం, బండారుపల్లి గ్రామాల్లోని ప్రజలకు ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో పూర్వ ప్రాథమిక విద్యపై కళాజాత కార్యక్రమాలను నాగేశ్వరరావు బృందం నిర్వహించింది. నాటికలు, పాటల ద్వారా ప్రజలు, గర్భిణులు, బాలింతలు, 6 సంవత్సరాల లోపు పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు అంగన్‌వాడీ కేంద్రాల ఉపయోగాలు, సేవలు, పోషకాహారాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సిబ్బంది శిరీష, వెంకటేష్, సురేష్, ఎస్‌సీవీ లీడర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ డీఎస్పీకి బదిలీ వర్తించదా..!?

సత్యవేడు, ఫిబ్రవరి 8: సత్యవేడు శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీగా పని చేస్తున్న జగదీష్‌నాయక్‌కు బదిలీ ఉంటుందా...ఉండదా..... అన్న చర్చ సర్వత్రా సాగుతోంది. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల విధులతో సంబంధం ఉన్న అన్నిశాఖల అధికారులు బదిలీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే పోలీసుశాఖలో కూడా బదిలీల ప్రక్రియ దాదాపు పూర్తి కావస్తోంది. ఇప్పటికే జిల్లాలో పోలీసు సబ్ డివిజన్ పరిధిలో మూడేళ్లగా విధులు నిర్వహిస్తున్న పలువురు డీఎస్పీలు బదిలీ అయ్యారు. శ్రీకాళహస్తి డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న భీమారావు ఏఎస్పీగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం ఆయన స్థానంలో మహేంద్రరెడ్డికి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. నాయుడుపేట డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న రాజగోపాల్ రెడ్డిని బదిలీ చేయగా, ఆయన స్థానంలో శ్రీనివాసరెడ్డిని నియమించింది. అయితే శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న జగదీష్‌నాయక్ మాత్రం బదిలీ కాలేదు. దీంతో ఆయనకు బదిలీ వర్తించదా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఆరేళ్లుగా ఇక్కడే..!

శ్రీసిటీలో హైటెక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు అయిన తరువాత 2018లో సీఐగా జగదీష్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్ల తరువాత డీఎస్పీగా పదోన్నతి పొందారు. సాధారణంగా నిబంధనల మేరకు ఏ అధికారికైనా పదోన్నతి పొందితే బదిలీ కావాల్సి ఉంది. అయితే జగదీష్ నాయక్ పదోన్నతి అనంతరం కూడా శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్‌లోనే పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో పోలీసు అధికారులు బదిలీ అవుతున్నా ఈయన బదిలీ అవుతారా లేదన్నది చర్చగా మారింది.

బీసీల తిరుగుబాటుతో వైసీపీ అంతం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8: దగా పడ్డ బీసీ వర్గం తిరుగుబాటుతో వైసీపీ అంతం కాక తప్పదని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో గురువారం జయహో బీసీ సభ జరిగింది. ముందుగా ఎన్టీఆర్, జ్యోతిరావు పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బీసీలు కుటుంబ వేడుకలు నిర్వహించుకునేలా ప్రతి మండలానికీ ఒక కమ్యూనిటీ భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసి యువతకు మంచి భవిష్యత్తును కల్పిస్తామన్నారు. స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు తిరిగి పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్పారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు నరసింహ యాదవ్ మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ రక్షణ చట్టం ద్వారా భద్రత కల్పిస్తామని భరోసా ఇచ్చారు. వైసీపీకి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, రెడ్డివారి గురువా రెడ్డి, దశరథాచారి, టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్, బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునుస్వామి యాదవ్, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శులు, ఉమేష్‌రావు, రేణుకమ్మ, బీసీ విభాగం తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు రుద్రకోటి సదా శివం, ఎన్నికల క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్ రవి, గాండ్ల సాధికార సమితి రాష్ట్ర సభ్యులు హరిబాబు, స్కిట్ కళాశాల మాజీ చైర్మన్ గురుదశరథన్, శ్రీకాళహస్తి పురపాలక సంఘం మాజీ కౌన్సిలర్లు సుప్రజ, శాంతి, ముని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జయహో బీసీ సభలో టీడీపీ నాయకులు

చిరంజీవి అభిమానులు వైసీపీకి బుద్ధి చెబుతారు

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు వైసీపీకి తగిన బుద్ధి చెబుతారని బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద చిరంజీవి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు పద్మ విభూషణ్ ప్రకటించడంపై టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ చిరంజీవిని వైసీపీ నాయకులు హేయంగా మాట్లాడడం వారి నీచ సంస్కారానికి నిదర్శనం అన్నారు.

బాల్య వివాహాలను నియంత్రించాలి



మాట్లాడుతున్న సీడీపీవో దేవకుమారి

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 8: మహాశివరాత్రి సందర్భంగా శ్రీకాళహస్తిలో జరిగే దేవుడి పెళ్లి సమయంలో బాల్య వివాహాల నియంత్రణకు అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సత్యవేడు ఐసీడీఎస్ సీడీపీవో దేవకుమారి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బాల్య వివాహాల నియంత్రణపై మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏవో త్రివిక్రమ్‌రావు, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఎంఈవో మునిసుబ్రమణ్యం, ఏపీఎం ఇందిరాగాంధీ, కార్యదర్శులు, వీఆర్వోలు, సీసీలు పాల్గొన్నారు.

కేవీబీపురం: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వెంకటకృష్ణయ్య ఆధ్వర్యంలో బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీవో శోభరాణి, సూపర్‌వైజర్లు, కల్పలత, సుమతి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

సత్యవేడు: నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి, ఎస్ఐ ఓబయ్య మాటాడారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కిషోర్, ఎస్ఐ రవి, ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య, ఏఎన్ఎం భార్గవి, సచివాలయ, విద్యార్థులు పాల్గొన్నారు.

కోలా ఆనంద్‌ను ఎమ్మెల్యేగా గెలిపించండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8: బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయబోతున్న కోలా ఆనంద్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. శ్రీకాళహస్తి పట్టణం 1వ వార్డులోని జైహింద్ పురం నుంచి గురువారం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అసెంబ్లీ కో-కన్వీనర్ మేళాగరం సుబ్రహ్మణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు గరికపాటి రమేష్‌బాబు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఏర్పాటు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 8: వరదయ్యపాళెం ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా పిట్టి చెంగయ్య, ప్రధాన కార్యదర్శిగా వెంపళ్ల చిన్నయ్య, ఆర్థికకార్యదర్శిగా మోహన రావు, గౌరవాధ్యక్షుడిగా పరంధామయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రంగనాథ్, రవిబాబు, శివకుమార్, మీరయ్య, కార్యదర్శులుగా సూరిబాబు, స్వామి దాస్, వెంకటేశ్వర్లు, సుబ్బరామయ్య, సురేఖ, వసంతను, ఆర్థిక కమిటీ సభ్యులుగా సంతోష్, చిన్న గురవయ్య, మోహన్‌బాబు, గోకులకృష్ణను, మహిళా కన్వీనర్‌గా సుగుణను, సీపీఎస్ కన్వీనర్‌గా హరిబాబును, జిల్లా కౌన్సిలర్లుగా శ్యామసుందర్, ఆది శేషయ్య, ముజీబ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



చిన్నయ్య, చెంగయ్య

నులి పురుగులను నిర్మూలిద్దాం

సత్యవేడు, ఫిబ్రవరి 8: ఆరోగ్యవంతమైన సమాజం కోసం నులి పురుగులను నిర్మూలిద్దామని సత్యవేడు మండలం దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ కోరారు. శుక్రవారం డీ వార్మింగ్ డేను పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లతో కలసి ఆయన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి నుంచి 19 సంవత్సరాలలోపు ఉన్న వారందరూ నులి పురుగుల నిర్మూలన మాత్రలను వాడాలన్నారు. ఇప్పటికే వైద్య సిబ్బంది ద్వారా ఆయా అంగన్వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు, కళాశాలలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ ఏపీహెచ్ఈవో సుబ్రహ్మణ్యం, హెల్త్ సూపర్‌వైజర్ నాగజ్యోతి, ఫార్మాసిస్టు భార్గవి, స్టాఫ్ నర్సులు పార్వతి, వనజ, పలువురు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



రేణిగుంట, ఫిబ్రవరి 8: రేణిగుంట జిల్లా పరిషత్ బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు గురువారం పూర్వ విద్యార్థులు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్పీ మోహన్, షేక్ జబ్బార్, జయంత్ కుమార్, ప్రిన్సిపాల్ ఈజీ విష్ణువర్ధనమ్, పీడీ.రేఖారాణి, దివాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ నాగేశ్వరరావును అభినందిస్తున్న సిబ్బంది

రేణిగుంట, ఫిబ్రవరి 8: రేణిగుంట తహసీల్దార్‌గా నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రజ్యోతిలో గురువారం 'రేణిగుంట తహసీల్దార్ ఎవరు' అనే వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన అధికారులు వెంటనే వైఎస్ఆర్ జిల్లా ఎర్రగుంట్ల మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావును నియమించారు. కార్యాలయం సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా ఇక్కడికి బదిలీ చేసిన నారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించకపోవడంతో నాగేశ్వరరావును నియమించారు.



తహసీల్దార్ రామాంజనేయులు

సత్యవేడు: రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియకు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ రామాంజనేయులు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో అభ్యంతరాలుంటే రాజకీయ పార్టీలు తమ దృష్టికి తీసుకు రావచ్చన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి నియోజకవర్గ ఆర్వో అధ్యక్షతన ప్రతివారం సమావేశం నిర్వహిస్తామ న్నారు.



తహసీల్దార్ నరసింహులు

● నాగలాపురం మండల తహసీల్దార్‌గా నరసింహులు బాధ్యతలు స్వీకరించారు. ఈయన వైఎస్ఆర్ కడప జిల్లా కేవీ పల్లి నుంచి బదిలీపై వచ్చారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవోగా ఇసాక్ ప్రవీణ్

తొట్టంబేడు, ఫిబ్రవరి 8: మండల ఎంపీడీవోగా ఇసాక్ ప్రవీణ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఈవోపీఆర్డీ తరుణాక్షిరెడ్డి పలువురు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మకూరు నుంచి ఇక్కడికి వచ్చారు.

ఆస్పత్రి రోడ్డుకు మళ్లీ అతుకులే..!

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8: అధ్వానంగా ఉన్న ఆస్పత్రి రోడ్డుకి అతుకులు వేసే పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఆర్టీసీ బస్టాండు వెనుక ప్రభుత్వాస్పత్రి ఉంది. కొద్ది సంవత్సరాల క్రితం నుంచి ఈరోడ్డు దయనీయంగా దర్శనమిస్తోంది. పెద్దఎత్తున నివాస కాలనీలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు ఇక్కడ ఉన్నాయి. సుమారు ఏడు మండలాల ప్రజలకు సేవలు అందించే ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఈ మార్గంలోనే ఉంది. నిత్యం పెద్ద సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఐదేళ్ల నుంచి ఈ రోడ్డుకు ప్రతిసారీ ఫిబ్రవరి మాసంలో తూతూ మంత్రంగా అతుకులు వేస్తుంటారు. ఆ తర్వాత జూన్‌లో వర్షాలకు రోడ్డు మళ్లీ గుంతలమయంగా మారుతూ ఉంటుంది. ఐదేళ్లుగా ఇదేతంతు. గత ఏడాది డిసెంబరులో కురిసిన భారీ వర్షాలతో మరింత అధ్వానంగా మారింది. ఈ సారైనా ఆస్పత్రి రోడ్డుకు మోక్షం కల్పిస్తారని జనం ఆశించారు. అయితే మళ్లీ యథావిధిగా కంటితుడుపుగా అతుకులు వేసే ప్రక్రియ చేపట్టారు. శాశ్వత ప్రాతిపదికన రోడ్డు వేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డులో మరమ్మతులు చేస్తున్న కార్మికులు